వార్త

# వినాయక వ్రతకల్పం

## ప్రత్యేక సంచిక

2022



# మోకాలి మార్పిడి శస్త్రచికిత్స గురించి వాస్తవాలు

ఇప్పటి దాకా మోకాళ్ల నొప్పులకు మందులు, ఫిజికల్ థెరపీ మరియు కార్టిసోన్ ఇంజెక్షన్లను ప్రయత్నించి ఉంటారు. కానీ మోకాళ్ళ ఆస్టియో ఆర్థరైటిస్ పై వీటివలన ఏ ప్రభావము ఉండకపోతే, తాము ఇష్టపడే పనులను చేయకుండా చేస్తుంది. ఇది విసుగు అనిపిస్తే కీళ్లను మార్చుకోవాలనే ఆలోచన వస్తుంది. జాయింట్ రీప్లేస్‌మెంట్‌లు సాధారణంగా విజయవంతమవుతాయి, వాటిని కలిగి ఉన్న చాలా మంది వ్యక్తులు దీర్ఘకాలికంగా నొప్పి లేకుండా చురుకైన జీవితాలను గడపడానికి వీలు కల్పిస్తుంది. ఇది నిజంగా ఒక వరం. రోగులు వారి జీవితాలను పునరుద్ధరించుకోవడానికి మరియు మార్చుకునేందుకు అవకాశం.

సమస్య ఉన్నవారు ఈ విజయవంతమైన ప్రక్రియ కోసం తమను తాము సిద్ధం చేసుకోవడం మంచిది. అనియంత్రిత మధుమేహం, పెరిగిన బరువు లేదా పేలవమైన పోషకాహారం వంటి వాటిని ముందుగా నియంత్రించుకొని జాగ్రత్త పడాలి. వీటి వలన ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఎక్కువవుతాయి.

సర్జికల్ టెక్నిక్ మరియు సర్జన్ అనుభవంతో సహా అనేక అంశాలను పరిగణనలోకి తీసుకోవాలి. ఒక నిర్దిష్ట ఆసుపత్రిని ఎంచుకోవాలి. సర్జన్ ప్రతి సంవత్సరం ఎన్ని ఆపరేషన్లు చేస్తారు అని కనుక్కోవాలి. రోగి వయస్సు, బరువు మరియు కార్యాచరణ స్థాయి (లెవెల్ ఆఫ్ ఆక్టివిటి) మార్పిడి చేసిన కీళ్లు ఎంత కాలం పనిచేస్తాయి అనే అంశంపై ప్రభావం చూపుతాయి.

వివిధ కీళ్ల మార్పిడి పైన జరిగిన అనేక అధ్యయనాల ఆధారంగా, ప్రస్తుతం మోకాలి మార్పిడిలో 90% ఇప్పటికీ 20 సంవత్సరాలకు పైగా బాగా పనిచేస్తాయని నిర్ధారించాయి.

కొత్త సాంకేతికతకు ఒక మంచి ఉదాహరణ అత్యంత "లో వేర్" లక్షణాలను కలిగి ఉన్న "అత్యంత క్రాస్-లింక్డ్ పాలిథిలిన్" అని పిలువబడే ప్లాస్టిక్. ఈ పదార్థంతో తయారు చేయబడిన ఇంప్లాంట్లు గతంలో ఉపయోగించిన ప్లాస్టిక్‌ల కంటే ఎక్కువ కాలం పనిచేస్తాయి.



ఈ కీళ్ల మార్పిడి చేయించిన తర్వాత కాలక్రమేణా ఒకే జాయింట్‌ను ఒకటి కంటే ఎక్కువ సార్లు మార్చుకోవాల్సిన అవసరం కలగవచ్చునని తెలుసుకోవాలి.

మోకాలి మార్పిడి ఆ జాయింట్‌కి ఒకే ఒక్క ఆపరేషన్ చేస్తే సరిపోతుందని ఎవరూ ఖచ్చితంగా చెప్పలేరు.

కొత్త మోకాలి వేయించుకున్న తర్వాత, దానిని చెక్కుచెదరకుండా ఉంచుకోవడానికి తీసుకోవలసిన కొన్ని జాగ్రత్తలు.

**అవి:**

- చురుకుగా ఉండండి కానీ రన్నింగ్, జాగింగ్ వంటి అధిక-ప్రభావ కార్య కలాపాలను నివారించండి.
- ఆరోగ్యకరమైన బరువును కలిగి ఉండండి. యువతలో ఊబకాయం ఉండడం వలన కీళ్ల మార్పిడి అవసరమయ్యే రోగుల యొక్క మరొక సమూహాన్ని సృష్టిస్తోంది. ఒక వ్యక్తి మోస్తున్న ప్రతి అదనపు 20 పౌండ్ల బరువు మోకాళ్లపై 100 పౌండ్ల కంటే ఎక్కువ ఒత్తిడిని కలిగిస్తుంది.
- ప్రతి కొన్ని సంవత్సరాలకు మీ ఆర్థోపెడిక్ నిపుణుడిని సంప్రదించండి.

నిర్దిష్ట ఇంప్లాంట్లు 30 సంవత్సరాల పాటు కొనసాగుతాయనే వాదన నిజం కాదు. ఇది నిజమని చెప్పడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవు (UK మరియు ఆస్ట్రేలియన్ రెజిస్ట్రీ) మరియు డేటా ఏమీ లేవు.




డాక్టర్ నీలం వి. రమణారెడ్డి
MS (ORTHO), MCH (ORTHO), UK
చీఫ్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్



STAR HOSPITALS
Expertise • Excellence • Empathy

రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్.
email: info@starhospitals.in
www.starhospitals.in

అపాయింట్మెంట్స్ కొరకు
ఫోన్ నం: 040-44 77 77 00

ఆరోగ్య విషయాల గురించి మరింత తెలుసుకోవడానికి క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి మరియు స్టార్ హాస్పిటల్ యూట్యూబ్ ఛానెల్‌ని ఇప్పుడే Subscribe చేసుకోండి.

'సంఘీ' భావం



# ప్రకృతి పరిరక్షణ సిద్ధి వినాయకుడి ఆశయం

వినాయక చవితి అనేక సందేశాలను మానవాళికి పంచే గొప్ప పండుగ. ఇతర పండుగల్లా కాకుండా ఇది సామాజికపరంగా కొనసాగుతోంది. అంతేకాదు ప్రకృతి పరంగా మనకు స్పష్టమైన సందేశాన్ని ఇస్తుంది. కొన్ని పండుగలు భక్తి శ్రద్ధలతో ఇంటికి మాత్రమే పరిమితమై జరుపు కుంటారు. అయితే సామాజికంగా అందరూ కలిసి చేసుకునే అతికొద్ది పండుగల్లో వినాయక చవితి అతి ముఖ్యమైనది. వర్షాకాలం ప్రారంభమై చెట్లకు చిగురులు పట్టి పర్యావరణం ఆకుపచ్చ చీర కట్టుకున్నట్లు ఉండే సీజన్‌లో ఈ పండుగ వస్తుంది. వినాయక చవితి నాడు తప్పనిసరిగా వర్షం కురుస్తుంది. పండగకు ముందే నెల రోజుల నుంచి వర్షాలు కురు స్తాయి. వేసవి కాలం మండుటెండకు బోసిపోయినట్లుండే చెట్లు చిగురులు వేసి కొత్త లేతాకుపచ్చతో కళకళలాడుతుంటాయి. మరోపక్క చెరువుల్లో వర్షం కురిసి అప్పటి వరకు బీడువాడినట్లు ఉండే నేల తడిగా మెత్తగా మారుతుంది. సమాజం ఆధునిక పోకడలు పోక ముందు 90 శాతం వ్యవసాయాధారిత కుటుంబాలే ఎక్కువగా ఉండేవి. గ్రామాల్లో చెరువులు, కుంటలు, నదుల నిర్వహణ విషయంలో ప్రతిఒక్కరూ ఆలోచన చేసే వారు. సాంకేతికత పెరగడం, నగరాల్లో పనిచేయాలని యువత భావించడంతో క్రమంగా తమ గ్రామం గురించి ఆలోచించే వారు తగ్గిపోయారు. ఏ పనిచేయాలన్నా ప్రభుత్వందే బాధ్యత అన్న భావన పెంచుకున్నారు. మనకు ఉపయోగపడే చెరువును గాని, నిత్యం ప్రయాణించే రహదారి కాని ఏదైనా అది ప్రభుత్వం చూసుకోవా లన్న భావన పెరిగిపోవడం వల్ల కోట్ల రూపాయలు ప్రభుత్వం ఖర్చు పెడుతున్నా ఆశించిన ఫలితాలు సాధించడం లేదు. వినాయక చవితి అటు వ్యవసాయ రంగానికి, ఇటు ప్రకృతి పరిరక్షణకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దారు. తొలకరి వర్షాలతో చెరువులు, కుంటల్లో నేల తడి గా మారుతుంది. ఆ మట్టిని గ్రామస్తులు తీసుకువచ్చి వినాయక ప్రతిమ లు చేసి పూజలు చేస్తారు. దీనితో మొత్తం గ్రామం తమ సమీపంలోని చెరువులు, కుంటల వద్దకు వెళ్లి ప్రతి కుటుంబం ఎంతోకొంత మట్టి తవ్వి ఇంటికి తీసుకువెళ్లేవారు. ఇది కాకుండా ప్రతి బస్తీలో, కాలనీలో యువకులు భారీ మొత్తంలో మట్టిని పోగుచేసి చౌరస్తాల్లో పెద్దపెద్ద వినాయక విగ్రహాల ప్రతిమలు ప్రతిష్ఠించే వారు. దీనితో చెరువుల్లో పూడికను ఎవరికి వారు తీసివేసి నీరు నిల్వ ఉండటానికి ఆయా చెరువు లకు జీవం పోసేవారు. వినాయకుడిని పత్రితో పూజిస్తారు కాబట్టి 14 రకాల చెట్ల నుంచి ఆకులను కోసి ఇంటికి తీసుకువచ్చే వారు. దీనివల్ల కొత్త ఆకులు మళ్లీ చిగురించి చెట్టుకు జీవం పోసుకునేందుకు దోహదప డేది. సీజన్ మారుతుండటం, లేత ఆకులు ఉండటంతో చీడపురుగులు ఆశించి నష్టం కలిగించేవి. ఈ తరుణంలో ఆకులను తెంపుకోవడం వల్ల చీడపురుగుల నుంచి చెట్లుకు విముక్తి లభించేది. దీనివల్ల సెప్టెంబరు, నవంబర్‌లో కురిసే వర్షాలకు చెట్టు మరింత ఏపుగా పెరిగి పర్యావరణా న్ని సమతుల్యం చేసే అవకాశం కలుగుతుంది. మరోపక్క ఇది సామా జిక పండుగ కావడంతో కాలనీవాసులు ప్రాంతీయ, వర్గ విభేదాలు మరిచి కలిసి మెలసి తిరిగే అవకాశం కలిగేది. స్థానికంగా చిన్నచిన్న తగాదాలు, ఘర్షణలు ఉన్నా వినాయకచవితి సమయంలో అందరూ కలిసి స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించేందుకు దోహదపడేది. ఈ విధంగా ప్రకృతి పరిరక్షణ, సామాజిక సమానత్వం వంటి అనేక అంశా ల్లో స్పష్టమైన ఫలితాలు కనిపించేవి. మట్టిపనివారికి, విద్యుత్ దీపాలం కరణ చేసే వారికి, వివిధ వృత్తులకు చెందిన వారికి ఏదో ఒక పని వినాయక చవితి సమయంలో లభించేది. ఇక పురాతన సాంప్రదాయా లు, సంస్కృతులకు చెందిన హరికథ, బుర్రకథ, తోలుబొమ్మలాట, నాటకాలు వంటి అనేక కాలక్షేప కార్యక్రమాలు వినాయక పందిళ్లలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించే వారు. దీనివల్ల ఆయా కుటుంబా లకు కొంత ఆర్థిక వెసులుబాటు లభించేది. ఇక తొమ్మిది రోజుల పాటు వినాయకుడి పూజలు ముగించి అందరూ కలిసి వినాయక ప్రతిమను సమీపంలో చెరువుల్లో నిమజ్జనం చేసే వారు. దీనివల్ల చెరువుల్లో మట్టి రీసైక్లింగ్ అయ్యేంది. చెరువు గట్లు పటిష్టంగా మారేందుకు అవకాశం కలిగేది. వినాయకుడిని పూజించిన పత్రి చెరువుల్లో వేయడం వల్ల ఆయా ఆకుల నుంచి వచ్చే రసాలు ప్రకృతిపరంగా నీటికి కొన్ని వనరు లను కల్పించేవి. నీటిలో కలిగిన ఈ ఆకుల పసరు, రసాలు నీటిని శుద్ధి చేయడంతో పాటు వ్యవసాయానికి ఉపయోగించే నీటికి కొత్త శక్తిని ఇవ్వడం జరుగుతుంది. ఇదంతా ఒకప్పటి అంశాలు, విషయాలు. ప్రస్తుతం అందుకు భిన్నమైన వాతావరణం వినాయకచవితి పందిళ్లలో కనిపిస్తోంది. విగ్రహాలను ఎత్తు పెంచడం ఫ్యాషన్‌గా మారిపోయింది. దీనికోసం మట్టికి బదులు పర్యావరణాన్ని హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌ను ఉపయోగిస్తున్నారు. ఇళ్లలో వినాయక ప్రతిమల విషయంలో కొంత మార్పు వచ్చింది. చాలా మంది ప్రస్తుతం మట్టి గణపతులను కొనుగోలు చేసి పూజలు చేస్తున్నారు. బస్తీల్లో ఏర్పాటుచేసే విగ్రహాల విషయంలో కూడా కొందరు మట్టితో చేసిన విగ్రహాలను ప్రతిష్టించాలని కమిటీలు దృష్టి సారిస్తున్నాయి. ఇది శుభపరిణామంగా కనిపిస్తోంది. విగ్రహాల ఎత్తు కంటే పర్యావరణాన్ని మద్దతు పలికే విధంగా ప్రతిమలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అదేవిధంగా విగ్రహాలు ఆకర్షణీయంగా కనిపించేందుకు ప్రమాదకారిగా ఉండే పెయింటింగ్‌లను ఉపయోగిస్తున్నారు. వీటి స్థానంలో సాంప్రదాయ బద్ధమైన రంగులను ఉపయోగించేందుకు ప్రయత్నించాలి. విగ్రహం ఆకర్షణీయంగా, అందంగా కనిపించాలే కాని ఎత్తు ముఖ్యం కాదన్న విషయాన్ని పందిరి నిర్వాహకులు గ్రహించాలి. న్యాయస్థానాలు కూడా పర్యావరణం దిశగా ఆలోచనలు చేయాలని ధార్మిక సంస్థలకు పదే పదే సూచనలు చేస్తున్నాయి.

ఇది అతి సున్నితమైన విషయం కావడంతో న్యాయస్థానాలు, ప్రభు త్వాలు అంతకు మించి ఏమీ చేయలేవు. ప్రజల్లో మార్పులు రావాలి. వినాయకుడు కోరుకునే పర్యావరణానికి చేరువుగా ఉంటూ భక్తి శ్రద్ధలతో పూజలు చేసి ఆశీస్సులు పొందడంతో పాటు రాబోయే తరాలకు ప్రకృతి ఫలాలు ఇవ్వడానికి ప్రతిఒక్కరూ ఆలోచించాలి.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

# విషయ సూచిక


♣ శ్రీ వినాయక వ్రతకల్పం...5

♣ వరసిద్ధి వినాయక పూజా ప్రారంభం..8

♣ ఏకవింశతి పత్రి పూజ..10

♣ శ్రీ గణపతి అష్టోత్తర శతనామావళి...11

♣ శ్రీ గణేశ ప్రార్థన....14

– వినాయకుని దండకము....15

– విఘ్నేశ్వరుని కథా ప్రారంభము...16

– విఘ్నేశాధిపత్యము....18

– ఋషిపత్నులకు నీలాపనిందలు...19

– విఘ్నేశ్వరుని కళ్యాణం...21

♣ అష్టవినాయక క్షేత్రాలు...22

నిమజ్జనం ఎందుకు చేస్తారు?..24

♣ గణపతి మెచ్చే ఉండ్రాళ్లు..26

♣ గణేశ పూజలో గరిక ప్రాముఖ్యత...27

♣ తమిళ పిళ్లయార్...30



# శ్రీ వినాయక వ్రతకల్పం

**ప**సుపు, కుంకుమ, వినాయక ప్రతిమ, అగరువత్తులు, హారతి కర్పూరం, అక్షతలు, బియ్యం, దీపంకుందులు, వత్తులు, అగ్గిపెట్టె, ఆవునేయి లేదా

## శ్రీ విఘ్నేశ్వర పూజా ద్రవ్యములు

నువ్వులనూనె, పంచామృతాలు (ఆవుపాలు, పెరుగు, నేయి, తేనె, పంచదార), తమలపాకులు, పోకచెక్కలు, పువ్వులు, పళ్ళు, వస్త్రం, యజ్ఞోపవీతం, గంధం, పంచపాత్ర, ఉద్ధరిణి, పళ్ళెం, గరిక, కొబ్బరికాయలు, నైవేద్య పదార్థములు, పత్రి, పాలవెల్లి.

## నైవేద్యం

ఉండ్రాళ్లు-21, వడపప్పు, పానకం, అటుకులు, కొబ్బరి, ఆహార పదార్థాలు. మట్టితో చేసిన గణపతి విగ్రహాన్ని పూజించడంవలన కరువు కాటకాలు రాకుండా పంటలు సమృద్ధిగా పండుతాయని ప్రతీతి. వ్యవసాయ అభివృద్ధి కలుగుతుంది. బంగారు గణపతి ప్రతిమ ఐశ్వర్యాభివృద్ధిని, వెండి ప్రతిమ ఆయురారోగ్యాన్నీ, రాగి ప్రతిమ సంకల్ప సిద్ధిని, శిలా ప్రతిమ మోక్ష, జ్ఞానాలను అనుగ్రహిస్తాయని పురాణాలు చెబుతున్నాయి.

## గణేశుని పూజ

*(ముందుగా పీట మీద ముగ్గువేసి, బియ్యంవేసి, దానిమీద మట్టి వినాయకుడి బొమ్మను ఉంచాలి. పైన పాలవెల్లి కట్టాలి. పసుపుతో వినాయకుణ్ణి చేయాలి. పూజ చేసేవాళ్లు బొట్టు పెట్టుకుని దీపారాధన చేసి వినాయకునికి నమస్కరించి పూజ ప్రారంభించాలి. ముందుగా పసుపుతో చేసిన వినాయకుణ్ణి పూజించాలి.*

ఓం శ్రీ మహాగణాధిపతయే నమః

**దీపారాధన**: ఈ క్రింది శ్లోకాన్ని చదువుతూ దీపాన్ని వెలిగించి, దీపం కుందివద్ద అక్షతలు ఉంచి నమస్కరించాలి.

శ్లో ॥ భోదీపదేవి రూపస్త్వం, కర్మసాక్షి హ్యావిఘ్నకృత్।
యావత్పూజాం కరిష్యామి తావత్వం సిద్ధిదో భవ॥
దీపారాధన ముహూర్తస్తు సుముహూర్తోస్తు॥

**పరిశుద్ధి :** *(పంచపాత్రలోని నీటిని ఉద్ధరిణి (చెంచా)తో తీసుకుని కుడిచేతి బొటనవేలు, మధ్య, ఉంగరపు వేళ్ళతో నీటిని ఈ క్రింది మంత్రం చెబుతూ తలపై చల్లుకోవాలి)*

అపవిత్రః పవిత్రో వా సర్వావస్థాంగతోపి వా।
యస్మరేత్ పుండరీకాక్షం సబాహ్యాంతరశ్శుచిః
పుండరీకాక్ష, పుండరీకాక్ష, పుండరీకాక్షాయ నమః

**శ్రీరస్తు    శుభమస్తు    అవిఘ్నమస్తు**

**శ్రీ గణేశాయ నమః**

శ్లో ॥ శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజం
ప్రసన్నవదనం ధ్యాయేత్సర్వ విఘ్నోపశాన్తయే ॥

అగజానన పద్మార్కం గజానన మహర్నిశం
అనేక దన్తం భక్తానాం యేకదన్త ముపాస్మహే ॥

### శ్రీ గణేశ షోడశ నామ ప్రతిపాదక శ్లోకాః

శ్లో ॥ సుముఖశ్చైకదన్తశ్చ కపిలో గజకర్ణకః
లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిపః
ధూమకేతుర్గణాధ్యక్షః ఫాలచంద్రో గజాననః
వక్రతుండః శూర్పకర్ణో హేరమ్బస్కన్దపూర్వజః
షోడశైతాని నామాని యః పఠేత్ శృణుయాదపిః
విద్యారమ్భే వివాహే చ ప్రవేశే నిర్గమే తథా,
సంగ్రామే సర్వకార్యేషు విఘ్నస్తస్య నజాయతే ॥



విద్యార్థులు తమ పాఠ్యపుస్తకాలు, పెన్ను, పెన్సిల్; వ్యాపారులైతే వారి వ్యాపార లెక్కల పుస్తకాలు, ఏ వ్యాపారం చేస్తుంటే ఆ వస్తువులు... వీటికి గంధం, బొట్టు పెట్టి దేవుడి దగ్గర వుంచాలి. పూజానంతరం అక్షతలు వాటిపై వేసి నమస్కరించాలి.

ఓం కేశవాయ స్వాహా
నారాయణాయ స్వాహా,
మాధవాయ స్వాహా
*(అని 3 సార్లు తీర్థం పుచ్చుకోవాలి)*
గోవిందాయ నమః
విష్ణవే నమః
మధుసూదనాయ నమః
త్రివిక్రమాయ నమః
వామనాయ నమః
శ్రీధరాయ నమః
హృషీకేశాయ నమః
పద్మనాభాయ నమః
దామోదరాయ నమః
సంకర్షణాయ నమః
వాసుదేవాయ నమః
ప్రద్యుమ్నాయ నమః
అనిరుద్ధాయ నమః
పురుషోత్తమాయ నమః
అధోక్షజాయ నమః
నారసింహాయ నమః
అచ్యుతాయ నమః
జనార్దనాయ నమః
ఉపేంద్రాయ నమః
హరయే నమః
శ్రీకృష్ణాయ నమః

*(అని కేశవ నామాలు చెప్పుకోవాలి.)*

శ్లో ॥ ఉత్తిష్ఠంతు భూత పిశాచాః! ఏతే భూమి భారకాః
ఏతేషామవిరోధేన! బ్రహ్మకర్మ సమారభే!

ఓం భూః ఓం భువః ఓగ్ం సువః ఓం మహః ఓం జనః ఓం తపః ఓగ్ం సత్యం ఓం తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్॥ ఓ మాపో జ్యోతి రసోమృతం బ్రహ్మ భూర్భువస్సురోమ్ ॥

**సంకల్పము :** మమ ఉపాత్త సమస్త దురితక్షయ ద్వారా శ్రీ పరమేశ్వర ముద్దిశ్య శ్రీ పరమేశ్వర ప్రీత్యర్థం శుభే శోభనే ముహూర్తే శ్రీ మహావిష్ణో రాజ్ఞేయా ప్రవర్తమానస్య అద్య బ్రహ్మణః ద్వితీయ పరార్థే శ్వేత వరాహకల్పే వైవస్వత మన్వంతరే కలియుగే ప్రథమ పాదే జంబూద్వీపే భరత వర్షే భరత ఖండే మేరోః దక్షిణ దిగ్భాగే శ్రీశైలస్య ఈశాన్య ప్రదేశే కృష్ణా గోదావర్యోః మధ్యదేశే స్వగృహే (సొంత ఇల్లు కానివారు వాసగృహే అని చెప్పుకోవాలి) సమస్త దేవతా బ్రాహ్మణ హరిహర సన్నిధౌ అస్మిన్ వర్తమాన వ్యావహారిక చాంద్రమానేన శ్రీ శుభకృత్ నామ సంవత్సరే దక్షిణాయనే వర్ష ఋతౌ



భాద్రపద మాసే శుక్లపక్షే చవితి తిథౌ బుధ .... వాసరే శుభనక్షత్రే శుభయోగే శుభకరణ ఏవంగుణ విశేషణ విశిష్ఠాయాం శుభతిథౌ, శ్రీమాన్ గోత్రః................ *(గోత్రం చెప్పవలెను)* నామధేయః.......... *(యజమాని తన పేరు చెప్పుకోవలెను.)* శ్రీమతః గోత్రస్య.......... నామధేయస్య, ధర్మపత్నీ సమేతస్య మమ సకుటుంబస్య క్షేమ స్థైర్య విజయ అభయ ఆయురారోగ్య ఐశ్వర్యాభివృద్ధ్యర్థం, ధర్మార్థ కామమోక్ష చతుర్విధ ఫలపురుషార్థ సిద్ధ్యర్థం, సకల ధనకనక విద్యా ప్రాప్త్యర్థం, వస్తు వాహన సమృద్ధ్యర్థం సర్వాభీష్ట ఫల సిద్ధ్యర్థం, పుత్రపౌత్రాభి వృద్ధ్యర్థం, శ్రీ గణపతి దేవతా ముద్దిశ్య శ్రీ గణపతి దేవతా ప్రీత్యర్థం కల్పోక్త ప్రకారేణ యావచ్ఛక్తి ధ్యానావాహనాది షోడశోపచార పూజాం కరిష్యే॥ *(కుడిచేతి ఉంగరపు వేలిని నీటిలో ముంచవలెను)*



తదంగ కలశపూజాం కరిష్యేః
*(మరలా కుడిచేతి ఉంగరపు వేలిని నీటిలో ముంచవలెను)*
*(కలశాన్ని గంధం, పుష్పములు, అక్షతలతో పూజించి కలశముపై కుడిచేతిని ఉంచి, క్రింది శ్లోకము చెప్పుకొనవలెను)*

శ్లో ॥ కలశస్య ముఖే విష్ణుః కంఠేరుద్ర సమాశ్రితః
మూలేతత్రస్థితో బ్రహ్మ మధ్యే మాతృగణా స్మృతాః
కుక్షౌతు సాగరాః సర్వేసప్తద్వీపా వసుంధరా!
ఋగ్వేదోథయజుర్వేదస్సా మవేదో హ్యథర్వణః
అంగైశ్చసహితాస్సర్వే కలశాంబు సమాశ్రితః
గంగే చ యమునే చైవ గోదావరి సరస్వతి !
నర్మదే సింధు కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు ॥

అయాంతు శ్రీ గణపతి పూజార్థం దురితక్షయ కారకాః కలశోదకేన దేవమాత్మానం పూజాద్రవ్యాణి చ సంప్రోక్ష్య:
*(కలశమునందలి నీటిని శిరస్సు పై చల్లుకొని పూజా ద్రవ్యములపై చల్లవలెను)*

గణానాంత్వా గణపతిగ్ం హవామహే కవిం కవీనా
ముపమశ్రవస్తవం జ్యేష్టరాజం బ్రహ్మణా బ్రహ్మణాస్పత
అనస్సృణ్వానూతిభిస్సీదసాదనం

***(పసుపుతో గణపతిని చేసి తమలపాకుపై ఉంచి కుంకుమతో బొట్టుపెట్టవలెను పసుపు విఘ్నేశ్వరుని క్రిందివిధంగా పూజించాలి)***



శ్రీ మహాగణాధిపతయే నమః
ధ్యాయామి ధ్యానం సమర్పయామి
(నమస్కరించవలెను)
ఆవాహయామి ఆవాహనం సమర్పయామి
***(నీటిని చల్లవలెను)***
పాదయోః పాద్యం సమర్పయామి ***(మరల నీటిని చల్లవలెను)***
ఔపచారిక స్నానం సమర్పయామి
***(నీటిని చల్లవలెను)***
స్నానానంతర ఆచమనీయం సమర్పయామి
***(నీటిని చల్లవలెను)***
వస్త్రం సమర్పయామి ***(దూదితో చేసిన వస్త్రం లేదా పుష్పం ఉంచాలి)***
గంధాన్ ధారయామి ***(గంధమును చల్లవలెను)***
గంధస్యోపరి అలంకరణార్థం అక్షతాన్ సమర్పయామి ***(అక్షతలు చల్లవలెను)***



**పుష్పై పూజయామి**
*(ఈ క్రింది నామాలు చదువుతూ పుష్పములతో పూజ చేయవలెను)*
ఓం సుముఖాయ నమః ఓం ఏకదంతాయ నమః ఓం కపిలాయ నమః ఓం గజకర్ణకాయ నమః ఓం లంబోదరాయ నమః ఓం వికటాయ నమః ఓం విఘ్నరాజాయ నమః ఓం గణాధిపాయనమః ఓం ధూమకేతవేనమః ఓం గణాధ్యక్షాయ నమః ఓం ఫాలచంద్రాయ నమః ఓం గజాననాయ నమః ఓం వక్రతుండాయ నమః ఓం శూర్పకర్ణాయ నమః ఓం హేరంబాయ నమః ఓం స్కంధ పూర్వజాయ నమః ఓం మహాగణాధిపతయే నమః నానా విధ పరిమళ పత్రపుష్పాణి సమర్పయామి.
***(పుష్పాలతోను, పత్రితోనూ పూజించవలెను)***
ధూపం ఆఘ్రాపయామి ***(అగరువత్తిని వెలిగించవలెను)***

దీపం దర్శయామి
***(దీపమును చూపవలెను)***
నైవేద్యం సమర్పయామి
***(బెల్లం ముక్కను నైవేద్యం పెట్టాలి)***
ఓం భూర్భువస్సువః
తత్సవితుర్వరేణ్యం భర్గో
దేవస్య ధీమహిః
ధియోయోనః ప్రచోదయాత్॥
సత్యం త్వర్తేన పరిషించామి
అమృతమస్తు
అమృతోపస్తరమసి
***(అని చెప్పి నైవేద్యముపై చుట్టూ నీటిని త్రిప్పి నైవేద్యంపై నీటిని అభికరించి ఎడమ చేతితో కుడి చేతిని పట్టుకొని, కుడి చేతితో నైవేద్యాన్ని గణాధిపతికి చూపిస్తూ ఈ క్రింది మంత్రాలు చెప్పుకోవలెను.)***
ఓం ప్రాణాయ స్వాహా,
ఓం అపానాయ స్వాహా,
ఓం వ్యానాయ స్వాహా,
ఓం ఉదానాయ స్వాహా,
ఓం సమానాయ స్వాహా,
ఓం బ్రహ్మణే స్వాహా
శ్రీ మహాగణాధిపతయే నమః
యథాభాగం గుడం నివేదయామి
***(బెల్లం ముక్కను నివేదించాలి)***
మధ్యే మధ్యే పానీయం సమర్పయామి ***(నీటిని చల్లవలెను)***
తాంబూలం సమర్పయామి
***(తాంబూలం ఉంచవలెను)***
ఆచమనీయం సమర్పయామి
***(నీటిని చల్లవలెను)***
ఆనంద కర్పూర నీరాజనం దర్శయామి
***(కర్పూరమును వెలిగించాలి)***

**శ్లో॥ వక్రతుండ మహాకాయ కోటిసూర్య సమప్రభ ।**
**అవిఘ్నంకురుమే దేవ సర్వ కార్యేషు సర్వదా ॥**

శ్రీ మహాగణాధిపతయే నమః ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి. గణాధిపతిః సుప్రీతః సుప్రసన్నో వరదో భవతు. మమ ఇష్టకామ్యార్థ ఫలసిద్ధ్యర్థం గణాధిపతి ప్రసాదం శిరసా గృహ్ణామి
***(గణపతికి పూజచేసిన అక్షతలను తీసుకొని శిరస్సున ఉంచుకొనవలెను)***

శ్రీ మహాగణాధిపతిం యథాస్థానం ప్రవేశయామి (పసుపు గణపతిని తూర్పుకు జరిపి మరల యథాస్థానంలో పెట్టాలి)

# వరసిద్ధి వినాయక పూజా ప్రారంభం

కేశవ నామాలు చెప్పుకుని *(పువ్వులు, అక్షతలు చేతిలో తీసుకొని గణపతి పాదాలను వాటితో పట్టుకుని ఈ క్రింది మంత్రాన్ని చదవాలి)*

ప్రాణ ప్రతిష్టః ఓమ్ అసునీతే పునరస్మాను చక్షుఃపునః ప్రాణ మిహానో దేహి భోగమ్ । జ్యోక్పశ్యేమ సూర్యముచ్చరంత మనుమతే మృడయానస్వస్తి। అమృతం నై ప్రాణాః। ప్రాణానేవ యథాస్థాన ముపహ్వయతే ॥ స్వామిన్ సర్వజగన్నాథ యావ త్పూజావసానకమ్। తావత్వం ప్రతిభావేన ప్రతిమేస్మిన్ సన్నిధిం కురు॥ సాంగం సాయుధం సవాహనం సశక్తిం పత్నీ పుత్రం పరివార సమేతం శ్రీ సిద్ధివినాయక స్వామిన్ ఆవాహితో భవ, స్థాపితో భవ, సుముఖోభవ, సుప్రసన్నో భవ, వరదో భవ, స్థిరాసనం కురు, ప్రసీదః ప్రసీదః ప్రసీద॥

**ధ్యానమ్ :** ***(పువ్వులు, అక్షతలు చేతితో పట్టుకుని గణపతికి నమస్కరిస్తూ ఈ క్రింది ప్రార్థన చేసిన తరువాత ఆయన పాదాల వద్ద ఉంచాలి)*** ఓం భవసంచిత పాపౌఘ విధ్వంసన విచక్షణం। విఘ్నాంధకారభాస్వంతం విఘ్నరాజ మహం భజే॥ ఏకదంతం శూర్పకర్ణం గజవక్త్రం చతుర్భుజం। పాశాంకుశధరం దేవం ధ్యాయేత్సిద్ధి వినాయకమ్॥ ఉత్తమం గణనాథస్య వ్రతం సంపత్కరం శుభం॥ భక్తాభీష్టప్రదం తస్మాత్ ధ్యాయేత్తం విఘ్ననాయకమ్॥ ధ్యాయేద్గజాననం దేవం తప్తకాంచన సన్నిభం। చతుర్భుజం మహాకాయం సర్వాభరణ భూషితం॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధివినాయక స్వామినే నమః ధ్యాయామి.

**ఆవాహనమ్ :** ***(పువ్వులు, అక్షతలు చేతితో పట్టుకుని గణపతికి నమస్కరిస్తూ ఈ క్రింది శ్లోకాన్ని చదివిన తరువాత ఆయన పాదాలవద్ద ఉంచాలి)*** అత్రాగచ్ఛ జగద్వంద్య సురరాజార్చితేశ్వర। అనాథనాథ సర్వజ్ఞ గౌరీగర్భ సముద్భవ॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధి వినాయకస్వామినే నమః ఆవాహయామి॥

**ఆసనమ్ :** ***(పువ్వులు, అక్షతలు చేతితో పట్టుకుని గణపతికి నమస్కరిస్తూ ఈ క్రింది శ్లోకాన్ని చదివిన తరువాత ఆయన పాదాల వద్ద ఉంచాలి)***

**మౌక్తికైః** పుష్పరాగైశ్చ నానారత్నైర్విరాజితం! రత్నసింహాసనం చారు ప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః నవరత్నఖచిత సింహాసనార్థ పుష్పాక్షతాన్ సమర్పయామి॥

**పాద్యమ్ :** ***(పుష్పంతో కలశంలోని నీటిని గణపతి పాదాలపై కొద్దికొద్దిగా చల్లాలి)*** గజవక్త్ర నమస్తేస్తు సర్వాభీష్ట ప్రదాయక। భక్త్యాపాద్యం మయాదత్తం గృహాణ ద్విరదానవ॥

శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః తమ పాదయోః పాద్యం సమర్పయామి॥

**అర్ఘ్యమ్ :** ***(పుష్పంతో కలశంలోని నీటిని గణపతి పాదాలపై కొద్దికొద్దిగా చల్లాలి)*** గౌరీపుత్ర! నమస్తేస్తు శంకర ప్రియనందన! గృహాణార్ఘ్యం మయాదత్తం గంధపుష్పాక్షతైర్యుతం॥ శ్రీసిద్ధిబుద్ధిసమేత సిద్ధి వినాయక స్వామినే నమః హస్తయోః అర్ఘ్యం సమర్పయామి॥

**ఆచమనీయమ్ :** **(పుష్పంతో కలశంలోని నీటిని గణపతి పాదాలపై కొద్దికొద్దిగా చల్లాలి)** అనాథనాథ సర్వజ్ఞ గీర్వాణ వరపూజితః గృహాణాచమనం దేవః తుభ్యం దత్తం మయా ప్రభో॥ శ్రీ సిద్ధిబుద్ధిసమేత సిద్ధి వినాయకస్వామినే నమః ముఖే ఆచమనీయం సమర్పయామి ॥

**మధుపర్కం :** ***(గణపతికి మధుపర్కం సమర్పించాలి)*** దధిక్షీర



సమాయుక్తం మధ్వాజ్యేన సమన్వితం॥మధుపర్కం గృహాణేదం గజవక్త్ర నమోస్తుతే॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధివినాయక స్వామినే నమః మధుపర్కం సమర్పయామి.

పంచామృత స్నానమ్ *(పంచామృతాలతో ఈ క్రింది చెప్పిన వరుసలో గణపతికి అభిషేకం చేయాలి)*

**పాలు:** ఓం ఆప్యాయస్వ సమేతుతే విశ్వత స్సోమవృషిణయం। భవా వాజస్య సంగథే॥ శ్రీ సిద్ధిబుద్ధిసమేత సిద్ధి వినాయక స్వామినే నమః క్షీరేణ స్నపయామి॥

**పెరుగు :** ఓం దధిక్రావుణ్ణో ఆకారిషం। జిష్ణోరశ్వస్య వాజినః సురభినో ముఖాకరత్। ప్రణ ఆయూగ్ంషి తారిషత్॥ శ్రీ సిద్ధిబుద్ధిసమేత సిద్ధివినాయకస్వామినే నమః

దధ్నా స్నపయామి॥

**నేయి :** ఓం శుక్రమసి జ్యోతిరసి తేజోసి దేవోవస్స వితోత్పునా త్వచ్ఛిద్రేణ పవిత్రేణ వసో స్సూ ర్యస్యరశ్మిభిః॥ శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః ఆజ్యేన స్నపయామి ॥

**తేనె :** ఓం మధువాతా ఋతాయతే। మధుక్షరంతి సింధవః మాధ్వీర్నస్స ంత్వోషధీ!। మధునక్తముతోషసి మధుమత్పార్థినగ్ం రజః। మధుద్యైరస్తునః పితా। మధుమాన్నో వనస్పతిర్మధుమాగ్ం ఆస్తుసూర్యః మాధ్వీర్గావో భవంతునః॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధి వినాయకస్వామినే నమః మధునా స్నపయామి ॥

**పంచదార** : ఓం స్వాదుఃపవస్వ దివ్యాజన్మనే। స్వాదు రింద్రాయ సుహవీతు నామ్నే। స్వాదుర్మిత్రాయ వరుణాయ వాయమే। బృహస్పతయే మధుమాగ్ం ఆదాభ్యః శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః శర్కరేణ స్నపయామి॥

***(మిగిలిన పంచామృతాలన్నింటినీ ఈ క్రింది శ్లోకం చెబుతూ అభిషేకం చేయాలి)*** స్నానం పంచామృతైర్దేవ గృహాణ గణనాయక। అనాథనాథ! సర్వజ్ఞ గీర్వాణ గణపూజిత॥ శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః పంచామృత స్నానం సమర్పయామి.



**ఫలోదకమ్ :**

(కొబ్బరినీటితో అభిషేకం చేయాలి) యాః ఫలినీర్యా ఫలాపుష్పాయాశ్చ పుష్పిణీః। బృహస్పతి ప్రసూతాస్తానో ముంచస్త్వగ్ంహనః॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః ఫలోదకేన స్నపయామి॥

**శుద్ధోదకమ్ :**

***(ఈ క్రింది శ్లోకంతో కలశంలోని నీటితో అభిషేకంచేయాలి. ఇక్కడ గణపతి ఉపనిషత్తు, పురుషసూక్త, నమకచమకాదులతో యథాశక్తి అభిషేకం చేయవచ్చు)*** గంగాది సర్వతీర్థేభ్య అహృతైరమలైర్జలైః స్నానం కురుష్వ భగవాన్ ఉమాపుత్ర నమోస్తుతే॥ శ్రీ సిద్ధిబుద్ధిసమేత సిద్ధివినాయక స్వామినే నమః శుద్ధోదకస్నానం సమర్పయామి॥ స్నానానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి॥ అంటూ కలశంలోని పుష్పంతో నీటిని పళ్ళెంలో విడవాలి. తరువాత ప్రతిమను శుభ్రంగా బట్టతో తుడిచి గంధం కుంకుమలతో అలంకరించి యథా స్థానంలో ఉంచాలి.

**వస్త్రమ్ :**

(నూతన వస్త్రములనుగాని, పత్తితో చేసిన వస్త్ర ద్వయాన్నిగాని ఈ క్రింది శ్లోకం చదివాక గణపతి పాదాలవద్ద ఉంచాలి) రక్తవస్త్రద్వయంచారు దేవయోగ్యం చ మంగళం। శుభప్రదం గృహాణత్వం లంబోదర హరాత్మజ॥ శ్రీ సిద్ధి బుద్ధిసమేత సిద్ధివినాయక స్వామినే నమః వస్త్రయుగ్మం సమర్పయామి॥

**యజ్ఞోపవీతమ్ :**

(పత్తితో చేసిన యజ్ఞోపవీతాన్నిగాని, పుష్పాక్షతలనుగాని దేవుని వద్ద ఉంచాలి) రాజతం బ్రహ్మ సూత్రం చ కాంచనంచోత్తరీయకం। గృహాణ దేవ సర్వజ్ఞ భక్తానామిష్టదాయక॥ శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః యజ్ఞోపవీతం సమర్పయామి ॥

**గంధమ్ :**

***(ఒక పుష్పాన్ని చందనంలో ముంచి గణపతి పాదాల వద్ద ఉంచాలి)*** చందనాగరుకర్పూర కస్తూరీ కుంకుమాన్వితం। విలేపనం సురశ్రేష్ఠ! ప్రీత్యర్థం ప్రతిగృహ్యతామ్॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధివినాయక స్వామినే నమః గంధాన్ ధారయామి.

**అక్షతలు**

(అక్షతలు దేవుని పాదాల వద్ద ఉంచాలి)

**అక్షతాన్ ధవళాన్ దివ్యాన్ శాలీయాన్ తండులాన్ శుభాన్।**

**గృహాణ పరమానంద శంభుపుత్ర నమోస్తుతే॥**

శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః

అలంకరణార్థం అక్షతాన్ సమర్పయామి॥

**పుష్పమ్**

(సుగంధ పుష్పాలను దేవుని పాదాల వద్ద ఒక్కొక్క నామానికి ఒక్కొక్క పుష్పం చొప్పున అథాంగ పూజ, అష్టోత్తరాలను చెబుతూ అలంకరణ చేయాలి.

పుష్పాలు సరిపోని పక్షంలో అక్షతలతోగానీ, పత్రితోగానీ పూజించాలి. ఏకవింశతి పత్రిపూజ సమయంలో పత్రితోనే పూజించాలి. దుర్వాయుగ్మ పూజా సందర్భంలో దూర్వాలతో పూజించాలి. లేని పక్షంలో అక్షతలతో పూజించాలి)

**సుగన్ధాని చ పుష్పాణి జాజీకుందముఖాని చ (ఏకవింశతి పత్రాణి సంగృహాణ నమోస్తుతే॥**

**శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః పుష్పై పూజయామి ॥**

## అథాంగ పూజ

గణేశాయ నమః పాదౌ పూజయామి ।

ఏక దంతాయ నమః గుల్ఫౌ పూజయామి।

విఘ్నరాజాయ నమః జానునీ పూజయామి।

కామారిసూనవే నమః జంఘే పూజమామి।

ఆఖువాహనాయ నమః ఊరూ పూజయామి।

హేరంబాయ నమః కటిం పూజయామి।

లంబోదరాయ నమః ఉదరం పూజయామి।

గణనాథాయ నమః హృదయం పూజయామి।

స్థూలకంఠాయ నమః కంఠం పూజయామి ।

పాశహస్తాయ నమః హస్తౌ పూజయామి॥

# ఏకవింశతి పత్రి పూజ

సుముఖాయ నమః
మాచీపత్రం పూజయామి।
గణాధిపాయ నమః
బృహతీ పత్రం పూజయామి।
ఉమాపుత్రాయ నమః
బిల్వపత్రం పూజయామి
గజాననాయ నమః
దూర్వాయుగ్మం పూజయామి
హరసూనవే నమః
దత్తూర పత్రం పూజయామి
లంబోదరాయ నమః
బదరీ పత్రం పూజయామి।
గుహాగ్రజాయ నమః
అపామార్గ పత్రం పూజయామి।
గజకర్ణకాయ నమః
తులసీ పత్రం పూజయామి ।
ఏక దంతాయ నమః
చూత పత్రం పూజయామి ।
వికటాయనమః
కరవీర పత్రం పూజయామి।
భిన్న దంతాయ నమః
విష్ణుక్రాంత పత్రం పూజయామి ।

వటవే నమః
దాడిమీ పత్రం
పూజయామి ।
సర్వేశ్వరాయ
నమః
దేవదారు పత్రం
పూజయామి ।
ఫాలచంద్రాయ
నమః
మరువక పత్రం
పూజయామి ।
హేరంబాయ
నమః
సింధువార
పత్రం
పూజయామి।
శూర్పకర్ణాయ
నమః
జాజీ పత్రం పూజయామి ।
సురాగ్రజాయ నమః
గండకీ పత్రం పూజయామి ।
ఇభవక్త్రాయ నమః



శమీ పత్రం
పూజయామి ।
వినాయకాయ
నమః
అశ్వత్థ పత్రం
పూజయామి ।
సుర
సేవితాయ
నమః
అర్జున పత్రం
పూజయామి ।
కపిలాయ
నమః
అర్కపత్రం
పూజయామి ।
శ్రీ గణేశ్వరాయ నమః
ఏకవింశతి పత్త్రై పూజయామి ॥



## దూర్వాయుగ్మ పూజ

గణాధిపాయ నమః
దూర్వాయుగ్మేన పూజయామి।
ఉమాపుత్రాయ నమః
దూర్వాయుగ్మేన పూజయామి ।
ఆఖువాహనాయ నమః
దూర్వాయుగ్మేన పూజయామి ।
ఈశపుత్రాయ నమః
దూర్వాయుగ్మేన పూజయామి ।
సర్వసిద్ధిప్రదాయ నమః
దూర్వాయుగ్మేన పూజయామి।
ఇభవక్త్రాయ నమః
దూర్వాయుగ్మేన పూజయామి ।
మూషిక వాహనాయ నమః
దూర్వాయుగ్మేన పూజయామి ।
కుమార గురవే నమః
దూర్వాయుగ్మేన పూజయామి ।



# శ్రీ గణపతి అష్టోత్తర శతనామావళి

ఓం గజాననాయ నమః
ఓం గణాధ్యక్షాయ నమః
ఓం విఘ్నరాజాయ నమః
ఓం వినాయకాయ నమః
ఓం ద్వైమాతురాయ నమః
ఓం ద్విముఖాయ నమః
ఓం ప్రముఖాయ నమః
ఓం సుముఖాయ నమః
ఓం కృతినే నమః
ఓం సుప్రదీపాయ నమః
ఓం సుఖనిధయే నమః
ఓం సురాధ్యక్షాయ నమః
ఓం సురారిఘ్నాయ నమః
ఓం మహాగణపతయే నమః
ఓం మాన్యాయ నమః
ఓం మహాకాలాయ నమః
ఓం మహాబలాయ నమః
ఓం హేరంబాయ నమః
ఓం లంబకర్ణాయ నమః
ఓం హ్రస్వగ్రీవాయ నమః
ఓం మహోదరాయ నమః
ఓం మహోత్కటాయ నమః
ఓం మహావీరాయ నమః
ఓం మంత్రిణే నమః
ఓం మంగళ స్వరూపాయ నమః
ఓం ప్రమదాయ నమః
ఓం ప్రథమాయ నమః
ఓం ప్రాజ్ఞాయ నమః
ఓం విఘ్నకర్త్రే నమః
ఓం విఘ్నహంత్రే నమః
ఓం విశ్వనేత్రే నమః
ఓం విరాటత్పయే నమః
ఓం శ్రీపతయే నమః
ఓం శృంగారిణే నమః
ఓం ఆశ్రితవత్సలాయ నమః
ఓం శివప్రియాయ నమః
ఓం శీఘ్రకారిణే నమః
ఓం శాశ్వతాయ నమః
ఓం బలాయ నమః
ఓం బలోత్థితాయ నమః
ఓం భవాత్మజాయ నమః
ఓం పురాణ పురుషాయ నమః
ఓం పూష్ణే నమః
ఓం పుష్కరక్షిప్తవారిణే నమః
ఓం అగ్రగణ్యాయ నమః
ఓం అగ్రపూజ్యాయ నమః
ఓం అగ్రగామినే నమః
ఓం మంత్రకృతే నమః
ఓం చామీకర ప్రభాయ నమః
ఓం సర్వాయ నమః
ఓం సర్వోపన్యాసాయ నమః
ఓం సర్వకర్త్రే నమః
ఓం సర్వనేత్రే నమః
ఓం సర్వసిద్ధి ప్రదాయ నమః
ఓం సర్వసిద్ధయే నమః
ఓం పంచహస్తాయ నమః
ఓం పార్వతీనందనాయ నమః
ఓం ప్రభవే నమః
ఓం కుమార గురవే నమః
ఓం అక్షోభ్యాయ నమః
ఓం కుంజరాసుర భంజనాయ నమః
ఓం ప్రమోదాయ నమః
ఓం మోదకప్రియాయ నమః
ఓం కాంతిమతే నమః
ఓం ధృతిమతే నమః
ఓం కామినే నమః
ఓం కపిత్థ పనసప్రియాయ నమః
ఓం బ్రహ్మాచారిణే నమః
ఓం బ్రహ్మారూపిణే నమః
ఓం బ్రహ్మ విద్యాధిపాయ నమః
ఓం విష్ణవే నమః
ఓం విష్ణుప్రియాయ నమః
ఓం భక్తజీవితాయ నమః
ఓం జితమన్మథాయ నమః
ఓం ఐశ్వర్య కారణాయ నమః
ఓం జ్యాయసే నమః
ఓం యక్షకిన్నర సేవితాయ నమః

ఓం గంగాసుతాయ నమః
ఓం గణాధీశాయ నమః
ఓం గంభీరనినదాయ నమః
ఓం వటవే నమః
ఓం అభీష్టవరదాయినే నమః
ఓం జ్యోతిషే నమః
ఓం భక్తనిధయే నమః
ఓం భావగమ్యాయ నమః
ఓం మంగళప్రదాయ నమః
ఓం అవ్యక్తాయ నమః
ఓం అప్రాకృత పరాక్రమాయ నమః
ఓం సత్యధర్మిణే నమః
ఓం సఖ్యే నమః
ఓం సరసాంబునిధయే నమః
ఓం మహేశాయ నమః
ఓం దివ్యాంగాయ నమః
ఓం మణికింకిణీ మేఖలాయ నమః
ఓం సమస్త దేవతా మూర్తయే నమః
ఓం సహిష్ణవే నమః
ఓం సతతోత్థితాయ నమః
ఓం విఘాతకారిణే నమః
ఓం విశ్వక్‌దృశే నమః
ఓం విశ్వరక్షాకృతే నమః
ఓం కళ్యాణ గురవే నమః
ఓం ఉన్మత్తవేషాయ నమః
ఓం అపరాజితే నమః
ఓం సమస్త జగదాధారాయ నమః
ఓం సర్వైశ్వర్యప్రదాయ నమః
ఓం ఆక్రాన్తచిదచిత్ప్రభవే నమః
ఓం శ్రీ విఘ్నేశ్వరాయ నమః

*(శ్రీసిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః అష్టోత్తర శతనామ పూజాం సమర్పయామి)*

**ధూపమ్ :** *(అగరువత్తులను వెలిగించి ఆ ధూపాన్ని గణపతికి కుడి చేతితో చూపించాలి. అంతేగాని అగరువత్తు ను చుట్టూ తిప్పకూడదు)* దశాంగం గుగ్గులోపేతం సుగంధం సుమనోహరం॥ ఉమా సుత నమస్తుభ్యం గృహాణవరదో భవ॥ శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధివినాయకస్వామినే నమః ధూపమాఘ్రాపయామి.

**దీపమ్ :** (కర్పూర దీపాన్నిగాని, నేతి దీపాన్నిగాని కుడిచేతితో భగవంతునికి చూపాలి) స్వాజ్యంత్రివర్తి సంయుక్తం వహ్నినాద్యోతితం మయా। గృహాణ మంగళం దీపం ఈశపుత్ర నమోస్తుతే ॥ శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః దీపం దర్శయామి॥

**నైవేద్యమ్ :** *(ముందుగా నేలపై పసుపునీళ్ల చల్లి, ముగ్గు వేసి దానిపై గణపతికి నివేదించాల్సిన అన్ని ఫలాలను, పిండి వంటలను పళ్లెంలో ఒకఆకువేసి ఆ ఆకులో పెట్టి ఉంచాలి. వాటిపై ఈ క్రింది మంత్రంతో నీళ్ళు చల్లాలి)*

ఓమ్ భూర్భువస్సువః। ఓం తత్సవితుర్వరేణ్యం
భర్గోదేవస్య ధీమహి । ధియోయనః ప్రచోదయాత్॥

*(పుష్పంతో నీటిని పదార్థాల చుట్టూ తిప్పాలి)*

ఓమ్ సత్యంత్వర్తేన పరిషించామి॥ *(అని సూర్యోదయం తర్వాత చెప్పాలి)*

ఓమ్ ఋతంత్వా సత్యేన పరిషించామి॥ *(అని సూర్యాస్తమయం తరువాత చెప్పాలి.)*

సుగంధాన్ సుకృతాంశ్చైవ మోదకాన్ ఘృతపాచితాన్ నైవేద్యం గృహ్యతాం దేవచణముద్గైః ప్రకల్పితాన్ । భక్ష్యం భోజ్యం చ లేహ్యంచ చోష్యం పానీయ మేవచ। ఇదం గృహాణ నైవేద్యం మయా దత్తం వినాయక॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః మహానైవేద్యం సమర్పయామి. *(పుష్పంతో నీటిని రెండుసార్లు పళ్లెంలో విడిచిపెట్టాలి)*

ఓమ్ అమృతమస్తు! ఓమ్ అమృతోపస్తరణమసి॥

*(అయిదుసార్లు ఎడమచేతితో కుడిమోచేయిని పట్టుకుని కుడిచేతితో గణపతివైపు నైవేద్యాన్ని చూపాలి)* ఓమ్ ప్రాణాయస్వాహా। ఓమ్ అపానాయ స్వాహా। ఓమ్ వ్యానాయ స్వాహా। ఓమ్ ఉదానాయ స్వాహా ఓమ్ సమానాయ స్వాహా॥ *(తరువాత సమర్పయామి అన్నప్పుడల్లా పుష్పంతో పళ్లెంలో నీళ్ళు వదలాలి)* మధ్యే మధ్యే పానీయం సమర్పయామి । అమృతాపిధానమసి ఉత్తరోపశనం సమర్పయామి। హస్తౌ ప్రక్షాళయామి। పాదౌ ప్రక్షాళయామి। శుద్ధాచమనీయం సమర్పయామి ॥

**తాంబూలమ్ :** *(మూడు తమలపాకులు, వక్కలు, అక్షతలు, పుష్పం, ఫలం సుగంధ ద్రవ్యాలు, దక్షిణలతో తాంబూలాన్ని గణపతి వద్ద ఉంచాలి)* పూగీఫలసమాయుక్తం నాగవల్లీదళైర్యుతం। కర్పూర చూర్ణ సంయుక్తం తాంబూలం ప్రతిగృహ్యతామ్॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః తాంబూలం సమర్పయామి॥ సదానంద విఘ్నేశ పుష్కలాని ధనాని చ। భూమ్యాం స్థితాని భగవాన్ స్వీకురుష్వ వినాయక॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః సువర్ణ పుష్పం సమర్పయామి ॥

**నీరాజనమ్ :** *(హారతి కర్పూరాన్ని వెలిగించి ఆ దీపాన్ని తిప్పుతూ గణపతికి చూపించాలి)* ఘృతవర్తిసహస్రైశ్చ కర్పూరశకలైస్తదా। నీరాజనం మయాదత్తం గృహాణ వరదోభవ॥ సమ్రాజంచ విరాజంచ అభిశ్రీః యాచనోగృహే లక్ష్మీరాష్ట్రస్యయాముఖే తయామా సగ్ం సృజామసి॥ సంతత శ్రీరస్తు। సమస్త సన్మంగళానిభవంతు। నిత్య శ్రీరస్తు నిత్యమంగళాని భవంతు॥ శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః నీరాజనం దర్శయామి ॥

నీరాజనానంతరం ఆచమనీయం సమర్పయామి॥
(అని పుష్పంతో పళ్ళెంతో పళ్ళెంలో నీటిని విడవాలి.)

**మంత్రపుష్పమ్ :** *(ఇక్కడ మంత్రపుష్పాన్ని పెద్దదిగాని, చిన్నదిగాని చెప్పవలెను. రానివారు ఈ శ్లోకాలతో మంత్రపుష్పాన్ని సమర్పించాలి)*

గణాధిప నమస్తేస్తు ఉమా పుత్రా విఘ్ననాశన।
వినాయకేశతనయ సర్వసిద్ధి ప్రదాయక॥
ఏకదంతైక వదన తథా మూషికవాహన।
ఏకదంతైక వదన తథా మూషికవాహన॥



కుమారగురవే తుభ్యమర్పయామి సుమాంజలిమ్॥
తత్పురుషాయ విద్మహే
వక్రతుండాయ ధీమహి।
తన్నోదంతిః ప్రచోదయాత్॥
శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి
వినాయక స్వామినే నమః
మంత్రపుష్పాంజలిం సమర్పయామి.

**ఆత్మప్రదక్షిణ నమస్కారమ్ :**

***(పువ్వులు, అక్షతలు తీసుకుని లేచి నిలబడి నమస్కారం చేయాలి. అంతేగాని తనచుట్టూ తాను తిరగకూడదు)***



ప్రదక్షిణం కరిష్యామి
సతతం మోదకప్రియ।
నమస్తే విఘ్నరాజాయ।
నమస్తే విఘ్ననాశన॥
యానికానిచ పాపాని
జన్మాంతర కృతానిచ।
తాని తాని ప్రణశ్యంతి
ప్రదక్షిణ పదేపదే।
పాపోహం పాపకర్మాణాం
పాపాత్మా పాపసంభవః
త్రాహిమాం కృపయాదేవ
శరణాగత వత్సల।
అన్యథా శరణం నాస్తి
త్వమేవ శరణం మమ।
తస్మాత్కారుణ్యభావేన
రక్షరక్ష గణాధిప॥
శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి
వినాయక స్వామినే నమః
ఆత్మప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి **(మూడుసార్లు చుట్టూ తిరిగి స్వామికి సాష్టాంగ నమస్కారం చేయాలి)**

**ప్రార్థన**

***(పుష్పాక్షతలతో ప్రార్థించి, తరువాత వాటిని గణపతి పాదాల వద్ద ఉంచాలి)***

నమస్తుభ్యం గణేశాయ నమస్తే విఘ్ననాశన। ఈప్సితంమేవరం దేహి పరత్ర చ పరాంగతిమ్॥ వినాయక నమస్తుభ్యం సతతం మోదకప్రియ। నిర్విఘ్నం కురుమేదేవ సర్వకార్యేషు సర్వదా॥ అపరాధ సహస్రాణి క్రియంతే అహర్నిశం మయా పుత్రోయమితి మామత్వా క్షమస్వ గణనాయక॥

శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః ప్రార్థన నమస్కారాన్ సమర్పయామి ॥

**సాష్టాంగ నమస్కారమ్ :**

***(భుజంమీది కండువాను నడుముకు చుట్టుకుని సాష్టాంగ నమస్కారం చేయాలి)*** ఉరసా శిరసా దృష్ట్యా మనసా వచసా తథా। పాదాభ్యాం కరాభ్యాం కర్ణాభ్యాం ప్రణామోష్టాంగ ఉచ్యతే॥ శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయక స్వామినే నమః సాష్టాంగ నమస్కారాన్ సమర్పయామి॥

**పునఃపూజా :**

**(పుష్పాక్షతలను గణపతి పాదాలవద్ద ఉంచాలి)**

ఛత్రమాచ్ఛాదయామి। చామరేణ వీచయామి। నృత్యం దర్శయామి। గీతం శ్రావయామి। ఆందోళికా నారోహయామి। గజానారోహయామి। అశ్వానారోహయామి। సమస్త రాజోపచార, భక్త్యోపచార, శక్త్యోపచార పూజాన్ సమర్పయామి॥

***(స్వామిపై పుష్పాక్షతలు వేయాలి)***

**శ్లో॥ మంత్రహీనం క్రియాహీనం
భక్తిహీనం గణాధిపతి యత్పూజితం
యమాదేవ పరిపూర్ణంతదస్తుతే అనేన
పూజావిధానేన
శ్రీ మహాగణాధిపతి సుప్రీత స్సుప్రసన్నో
వరదోభవతు.**

***(నేను చేసిన పూజలో మంత్రలోపము, క్రియాలోపము, భక్తిలోపము ఉన్నను అవన్నీ తొలగిపోవుగాక. గణపతి ఈ పూజతో సంతృప్తి పొందుగాక)***

## అపరాధ ప్రార్థన :

(రెండు చేతులు జోడించి గణపతికి నమస్కరించి, చెంపలు వేసుకోవాలి)

**అపరాధ సహస్రాణి క్రియంతేహం
అహర్నిశా।
పుత్రోయమితి మామత్వా క్షమస్వ
గణనాయక॥
అవాహనం నజానామి నజానామి
విసర్జనం।
పూజాంచైవ నజానామి క్షమ్యతాం గణనాయక॥
శ్రీ సిద్ధిబుద్ధిసమేత సిద్ధి వినాయక స్వామినే నమః
అపరాధ నమస్కారాన్ సమర్పయామి॥**

*(ఈ క్రింది మంత్రాలను చెబుతూ అక్షతలను నీటితో పళ్లెంలో విడిచిపెట్టాలి)*

అనేన మయాకృతేన కల్పోక్త ప్రకారేణ గకార గణపతి అష్టోత్తర శతనామ సహిత యావచ్ఛక్తి ధ్యానావాహనాది షోడశోపచార పూజానేన భగవాన్ సర్వాత్మకః శ్రీ సిద్ధి బుద్ధి సమేత సిద్ధి వినాయకస్వామిన్ సుప్రీతః సుప్రసన్నః వరదో భవతు.

ఓం గోవిందాయ నమః
ఓం విష్ణవే నమః
ఓం మధుసూదనాయ నమః
ఓం త్రివిక్రమాయ నమః
ఓం వామనాయ నమః
ఓం శ్రీధరాయ నమః
ఓం హృషీకేశాయ నమః
ఓం పద్మనాభాయ నమః
ఓం దామోదరాయ నమః
ఓం సంకర్షణాయ నమః
ఓం వాసుదేవాయ నమః
ఓం ప్రద్యుమ్నాయ నమః
ఓం అనిరుద్ధాయ నమః
ఓం పురుషోత్తమాయ నమః
ఓం అధోక్షజాయ నమః
ఓం నారసింహాయ నమః
ఓం అచ్యుతాయ నమః
ఓం జనార్దనాయ నమః
ఓం ఉపేంద్రాయ నమః
ఓం హరయే నమః
ఓం శ్రీకృష్ణాయ నమః




తుండమునేకదంతమును తోరపు బొజ్జయు వామహస్తమున్
మెండుగ మ్రోయు గజ్జెలును మెల్లని చూపులు మందహాసమున్
కొండొక గుజ్జురూపమున కోరిన విద్యలకెల్ల నొజ్జయై యుండెడి
పార్వతీ తనయ ఓయి గణాధిప నీకు మ్రొక్కెదన్.
తొలుత నవిఘ్నమస్తనుచు ధూర్జటినందన నీకు మ్రొక్కెదన్
ఫలితము సేయుమయ్య నిను ప్రార్థన చేసెద నేకదంత
నా వలపటి చేతి గంటమున వాక్కున నెప్పుడు బాయకుండుమీ
తలపున నిన్ను వేడెద దైవగణాధిప! లోకనాయకా!
తలచితినే గణనాథుని తలచితినే విఘ్నపతిని
తలచిన పనిగా దలచితినే హేరంబుని
దలచితి నా విఘ్నముల దొలగుట కొఱకున్
అటుకులు కొబ్బరిపలుకులు చిటిబెల్లము
నానుబ్రాలు చెరకు రసంబున్
నిటలాక్షు నగ్రసుతునకు
పటుతరముగ విందుసేతు ప్రార్థింతు మదిన్

**ఉద్వాసనమ్ :**

*(ఈ క్రింది మంత్రంతో గణపతి ప్రతిమను ఈశాన్యదిశగా మూడు సార్లు కదపవలెను)* యజ్ఞేన యజ్ఞమయజంత దేవాః.
తాని ధర్మాణి ప్రథమాన్యాసన్ ॥
తేహనాకం మహిమానస్య చంతే.
యత్రపూర్వే సాధ్యాస్సంతి దేవాః॥
శ్రీ సిద్ధిబుద్ధి సమేత సిద్ధి వినాయకస్వామిన్ యథా స్థాన ముద్వాసయామి॥ పూజా విధానం సంపూర్ణమ్.

# సంకట నాశన (సంకటహార) గణేశ స్తోత్రమ్

**నారద ఉవాచ**

ప్రణమ్య శిరసాదేవం గౌరీపుత్రం వినాయకమ్.
భక్తావాసం స్మరే న్నిత్య మాయుః కామార్థ సిద్ధయే ॥ 1

ప్రథమం వక్రతుండం చ ఏకదంతం ద్వితీయకమ్ ।
తృతీయం కృష్ణపింగాక్షం గణవక్త్రం చతుర్థకమ్ ॥ 2



లంబోదరం పంచమం చ షష్ఠం వికటమేవ చ ।
సప్తమం విఘ్నరాజం చ ధూమ్రవర్ణం తథాష్టమమ్ । 3

నవమం ఫాలచంద్రం చ దశమం తు వినాయకమ్ ।
ఏకాదశం గణపతిం ద్వాదశం తు గజాననమ్ ॥ 4

ద్వాద శైతాని నామాని త్రిసంధ్యం యః పఠేన్నరః ।
న చ విఘ్నభయం తస్య సర్వసిద్ధికరం ప్రభో ॥ 5

విద్యార్థీ లభతే విద్యాం ధనార్థి లభతే ధనమ్ ।
పుత్రార్థీ లభతే పుత్రా న్మోక్షార్థి లభతే గతిమ్ ॥ 6

జపే ద్గణపతి స్తోత్రం షడ్భిర్మాసైః ఫలం లభేత్ ।
సంవత్స రేణ సిద్ధిం చ లభతే నాత్ర సంశయం ॥ 7

అష్టభ్యో బ్రాహ్మణేభ్యశ్చ లిఖిత్వా యః సమర్పయేత్ ।
తస్య విద్యా భవే త్సర్వా గణేశస్య ప్రసాదతః ॥ 8

# వినాయకుని దండకము



శ్రీ పార్వతీ పుత్ర లోకత్రయీ స్తోత్ర, సత్పుణ్యచారిత్ర, భద్రేభవక్త్రా మహాకాయ, కాత్యాయనీనాథ సంజాతస్వామీ శివాసిద్ధి విఘ్నేశ, నీ పాద పద్మంబులన్, నీదు కంఠంబు నీ బొజ్జ నీ మోము నీ మౌళి బాలేందు ఖండంబు నీ నాల్గు హస్తంబులన్నీ కరాళంబు నీ పెద్ద వక్త్రంబు దంతంబు నీ పాద యుగ్మంబు లంబోదరంబున్ సదామూషికాశ్వంబు నీ మందహాసంబు నీ చిన్ని తొండంబు నీ గుజ్జు రూపంబు నీ శూర్పకర్ణంబు నీ నాగయజ్ఞోపవీతంబు నీ భవ్యరూపంబు దర్శించి హర్షించి సంప్రీతి మ్రొక్కంగ శ్రీ గంథమున్ గుంకుమం బక్షతలాజులున్ చంపకంబున్ తగన్ మల్లెల న్మొల్లలన్మంచి చేమంతులున్ తెల్లగన్నేరులన్ మంకెలన్ పొన్నలన్ పువ్వులు న్మంచి దుర్వంబులందెచ్చి శాస్త్రోక్తరీతిన్ సమర్పించి పూజించి సాష్టాంగంబు జేసి విఘ్నేశ్వరా నీకు



టెంకాయలుం పొన్నంటిపండున్ మరిస్మంచివౌ ఇక్షుఖండంబులు, రేగుబండ్లప్పడాల్ వడల్ నేతిబూరెల్ మరీస్ గోధుమప్పంబులు న్వడల్ పున్గులున్ గారెలున్ చొక్కమౌ చల్మిడిన్ బెల్లమున్ తేనెయుం జున్ను బాలాజ్యమున్నానుబియ్యంబు చామ్రంబ బిల్వంబు మేల్ బంగరున్ బళ్లెమందుంచి నైవేద్యముంబంచనీ రానంబున్ నమస్కారముల్ జేసి విఘ్నేశ్వరా నిన్ను బూజింపకే యన్యదైవంబుల్ ప్రార్థనల్చేయుటల్ కాంచనం బొల్లకే యిన్మ్రుదాగోరు చందంబుగారే మహాదేవ యో భక్తమందార యో సుందరాకార యోభాగ్య గంభీర యోదేవ చూడామణి లోక రక్షామణి బంధు చింతామణీ స్వామి నిన్నెంచ నేనెంత నీదాసదాసాది దాసుండ శ్రీ దొంత రాజన్వయుండ రామాభి ధానుండ నన్నిప్డు చేపట్టి సుశ్రేయునింజేసి శ్రీమంతుగనూచి హృత్పద్మ సింహాసనారూఢతన్నిల్పి కాపాడుటేకాదు నిన్గొల్చి ప్రార్థించు భక్తాళికిన్ కొంగు బంగారమై కంటికిన్ రెప్పవై బుద్ధియున్విద్యయున్నాడియున్ బుత్ర పౌత్రాభివృద్ధిన్ దగన్గల్గగా జేసి పోషించు మంటిన్ గృపన్ గావుమంటిన్ మహాత్మా! **ఇవే వందనంబుల్ శ్రీ గణేశా నమస్తే నమస్తే నమః**

# విఘ్నేశ్వరుని మంగళహారతులు

శ్రీ శంభుతనయునకు సిద్ధిగణనాధునకు వాసిగల దేవతా వంద్యునకును ఆ సరసవిద్యలకు ఆదిగురువైనట్టి భూసురోత్తమ లోకపూజ్యునకును జయ మంగళం నిత్య శుభమంగళం!

నేరేడు మారేడు నెలవంక మామిడి దూర్వారచెంగల్వ ఉత్తరేణు వేరువేరుగా దెచ్చి వేడ్కతో పూజింతు పర్వమున దేవ గణపతికి నెపుడు

॥జయ॥

సుచిరముగ భాద్రపద శుద్ధచవితి యందు పొసగ సజ్జనులచే పూజగొల్తు శశి చూడరాదన్న జేకొంటినొక వ్రతము పర్వమున దేవగణపతికి నిపుడు

॥జయ॥

పానకము వడపప్పు పనస మామిడి పండ్లు దానిమ్మ ఖర్జూర ద్రాక్షపండ్లు తేనెతోమాగిన తియ్యమామిడిపండ్లు మాకు బుద్ధినిచ్చు గణపతికినిపుడు

॥జయ॥

ఓ బొజ్జ గణపయ్య నీ బంటు నేనయ్య ఉండ్రాళ్ల మీదికి దండుపంపు కమ్మనీ నెయ్యియు కడుముద్దపప్పును బొజ్జనిండుగ దినుచును పొరలుచును

॥జయ॥

వెండి పళ్లెములోన వేవేల ముత్యాలు కొండలుగ నీలములు కలయబోసి మెండుగను హారములు మెడనిండ వేసికొని దండిగా నీకిత్తు ధవళారతి

॥జయ॥

పువ్వులను నినుగొల్తు పుష్పాల నినుగొల్తు గంధాల నినుగొల్తు కస్తూరినీ ఎప్పుడూ నినుగొల్తు ఏకచిత్తమ్మున పర్వమున దేవగణపతికి నిపుడు

॥జయ॥

ఏకదంతంబున ఎల్లగజవదనంబు బాగైన తొండంబు వలపు కడుపు జోకయిన మూషికము పరక నెక్కాడుచు భవ్యుడగు దేవ గణపతికి నిపుడు ॥జయ॥

మంగళము మంగళము మార్తాండ తేజునకు మంగళము సర్వజ్ఞ వందితునకు మంగళము ముల్లోక మహిత సంచారునకు మంగళము దేవ గణపతికి నిపుడు

॥జయ॥

సిద్ధి విఘ్నేశ్వర ప్రసిద్ధిగా పూజింతు
ఒనరంగ నిరువది యొక్క పత్రి దానిమ్మ
మరువమ్ము దర్భ విష్ణుక్రాంత యుమ్మెత్త
దూర్వార యుత్తరేణి
॥జయ॥

కలువలు మారేడు గన్నేరు జిల్లేడు
దేవకాంచన రేగు దేవదారు జాజి
బలురక్కసి జమ్మి దాసనపువ్వు గరిక
మాచిపత్రి మంచి మొలక
॥జయ॥



అగరు గంధాక్షత దూప దీప నైవేద్య
తాంబూల పుష్పోపహారములును భాద్రపద
శుద్ధ చవితిని



కుడుములు నానుబాలు
ఉండ్రాళ్ల పప్పు
॥జయ॥

పాయసము
జున్ను
తేనెయు
భక్తిమీర కోరి
పూజింతు
నిన్నెపుడు
కోర్కెలలర
॥జయ॥

బంగారు చెంబుతో
గంగోదకము దెచ్చి
సంగతిగ శిశువునకు జలకమార్చి
మల్లెపువ్వుల దెచ్చి మురహరిని పూజింతు
రంగైన నా ప్రాణలింగమునకు ॥జయ॥

పట్టు చీరలు మంచి పాడిపంటలు గల్గి ఘనముగా
కనకములు కరులు హరులు యిష్ట సంపదలిచ్చి యేలిన స్వామికి
పట్టభద్రుని దేవగణపతికి నిపుడు ॥జయ॥

ముక్కంటి తనయుడని ముదముతో నేనును చక్కనైన వస్తుసమితి
గూర్చి నిక్కముగ మనమును నీయందె నేనిల్పి ఎక్కుడగు
పూజలాలింప జేతు ॥జయ॥

మల్లెలా మొల్లలా మంచి సంపెంగలా చల్లనైనా గంధసారములను
ఉల్లమలరగ మంచి ఉత్తమపు పూజలు కొల్లలుగ
నేజేతు కోరి విఘ్నేశ ॥జయ॥

దేవాదిదేవునకు దేవతారాధ్యునకు
దేవేంద్రవంద్యునకు దేవునకును దేవతలు
మిముగొల్చి తెలిసి పూజింతురు.
భవ్యుడగు దేవగణపతికి నిపుడు
॥జయ॥

చెంగల్వ చేమంతి చెలరేగి గన్నేరు
తామరలు తంగేడు తరచుగాను
పుష్పజాతులు తెచ్చి పూజింతు నేనిపుడు
బహుబుద్ధి గణపతికి బాగుగాను
॥జయ॥

మారేడు మామిడి మాదీఫలంబులు
ఖర్జూర పనసలును కదళికములు నేరేడు
నెంవంది
టెంకాయ తేనెయు చాలగా నిచ్చెదరు చనువుతోడ ॥జయ॥

ఓ బొజ్జగణపతి ఓర్పుతో రక్షించి కాచి నన్నేలు మీ కరుణతోను
మాపాల గలవని మహిమీద నెల్లపుడు కొనియాడుచుందును
కోర్కెదీర జయమంగళం నిత్య శుభమంగళం।



## విఘ్నేశ్వరుని కథా ప్రారంభము

**(అక్షతలు చేతిలో వుంచుకుని కథ వినాలి)**

**సూ**తమహాముని శౌనకాది మునులకు విఘ్నేశ్వరోత్పత్తియు, చంద్రదర్శన దోషకారణంబును, తన్నివారణమును చెప్పదొడంగెను.

పూర్వము గజరూపముగల రాక్షసేశ్వరుండు శివుని గురించి ఘోర తపంబొనర్చెను.



అతని తపమునకు మెచ్చి పరమేశ్వరుడు ప్రత్యక్షమై వరంబు కోరుకోమనెను.

అంత గజాసురుండు పరమేశ్వరుని స్తుతించి–

స్వామీ! నీ వెల్లప్పుడు నా యుదరమందు వసించి యుండుమని కోరెను.



భక్త సులభుండగు నా పరమేశ్వ రుడు అతని కోర్కె దీర్చి గజాసురుని యుదరమందు ప్రవేశించి సుఖంబున నుండెను.

కైలాసమున పార్వతీదేవి భర్తజాడ తెలియక పలు తెరంగుల నన్వేషిం చుచు కొంత కాలమునకు గజాసుర గర్భస్థుడగుట తెలిసికొని రప్పించుకొను మార్గముగానక పరితపించుచు విష్ణుమూర్తిని ప్రార్థించి తన పతి వృత్తాంతము తెలిపి,

"మహాత్మా! నీవు పూర్వము భస్మాసు రుని బారి నుండి నా పతిని రక్షించి నాకు యొసంగితివి. ఇప్పుడు కూడా నుపాయాంతరముచే నా పతిని రక్షింపుము" అని విలపింప,

శ్రీహరి యా పార్వతి నూరడించి పంపె.

అంత నా హరి బ్రహ్మాది దేవతలను పిలిపించి, గజా సుర సంహారమునకు గంగిరెద్దుమేళమే యుక్తమని నిశ్చ యించి, నందిని గంగిరెద్దుగా నలం కరించి, బ్రహ్మాది దేవత లందరిచేతను తలొక వాద్యమును ధరింపజేసి, తానును చిరుగంటలు, సన్నాయిలు దాల్చి గజాసు రపురంబు జొచ్చి జగన్మోహనం బుగా నాడించుచుండగా, గజాసురుండు విని, వారలను తన చెంతకు పిలిపించి తన భవనమందు నాడింప నియోగించెను.

బ్రహ్మాది దేవతలు వాద్య విశేషం బుల బోరు సలుప జగన్నాటక సూత్ర ధారియగు నా హరి చిత్ర విచిత్ర కరం బుగ గంగిరెద్దును ఆడించగా, గజాసు రుండు పరమానంద భరితుడై "మీకేమి కావలయునో కోరుడొసంగెద" ననిన, హరి వానిని సమీపించి, "ఇది శివుని వాహనమగు నంది" శివుని కనుగొనుటకై వచ్చె కావున శివునొసంగు" మనెను.

ఆ మాటలకు గజాసురుడు నివ్వెర పడి, అతనిని రాక్ష సాంతకుడగు శ్రీహ రిగా నెరింగి, తనకు మరణమే నిశ్చయ మనుకొనుచు తన గర్భస్థుండగు పరమేశ్వ రుని "నా శిరసు త్రిలోక పూజ్యముగా జేసి, నా చర్మము నీవు ధరింపుమని" ప్రార్థించి విష్ణుమూర్తికి అంగీకారము తెలుప నాతడు నందిని ప్రేరేపించెను.

నందియు తన శృంగములచే గజాసు రుని చీల్చి సంహరించెను.

అంత శివుడు గజాసుర గర్భము నుండి బహిర్గతుడై విష్ణుమూర్తిని స్తుతించెను.

అంతనా హరి "దుష్టాత్ములకిట్టి వరంబు లీయరాదు... ఇచ్చినచో పాము నకు పాలుపోసినట్లగు"నని ఉపదేశించి బ్రహ్మాది దేవతలను వీడ్కొ లిపి తాను వైకుంఠమున కేగెను. శివుడు నందినెక్కి కైలాసంబున కతివేగంబున జనియె.




కైలాసంబున పార్వతీదేవి భర్త రాకను దేవాదుల వలన విని ముదమంది అభ్యం గన స్నానమాచరించుచు నలుగు పిండితో నొక బాలునిగ జేసి, ప్రాణం బొసగి, వాకిలి ద్వారమున కాపుగా ఉంచెను.

స్నానానంతరము పార్వతి సర్వాభరణ ముల నలంకరించుకొనుచు పతి రాక కోసం నిరీక్షించుచుండె.

అపుడు పరమేశ్వరుడు నంది నధిరో హించి వచ్చి లోపలికి పోబోవ వాకిలి ద్వారమునను్న బాలుడడ్డగించెను.

శివుడు కోపించి త్రిశూలముతో బాలుని కంఠంబు దునిమి లోనికేగెను. అంత పార్వతీదేవి భర్తను గాంచి, ఎదురేగి, అర్ఘ్య పాద్యాదులచే పూజించె. వారిరు వురును పరమానందమున ప్రియభాషణ ములు ముచ్చటించుచుండ ద్వారమందలి బాలుని ప్రసంగము వచ్చె.

అంత మహేశ్వరుండు తానొనరించిన పనికి చింతించి, తాను తెచ్చిన గజాసుర శిరంబును బాలుని కతికించి ప్రాణంబు నొసంగి "గజాననుడు"అని నామం బొసంగె. అతనిని పుత్ర ప్రేమంబున ఉమామహేశ్వరులు పెంచుకొనుచుండిరి.

గజాననుడు తల్లిదండ్రులను పరమభక్తితో సేవించుచుండెను. అతడు సులభముగా ఎక్కి తిరుగుటకు అనింద్యుడను ఒక ఎలుక రాజును వాహనముగా జేసికొనెను.

కొంత కాలమునకు పార్వతీ పరమే శ్వరులకు కుమారస్వామి జనియిం చెను. అతడు మహాబలశాలి. అతని వాహన రాజము నెమలి. దేవతల సేనానాయకుడై ప్రఖ్యాతి గాంచి యుండెను.



# విఘ్నేశాధిపత్యము

ఒకనాడు దేవతలు, మునులు పరమేశ్వరుని సేవించుచు విఘ్నముల కొక్కని అధిపతిగా తమ కొసంగుమని కోరిరి.

గజాననుడు తాను జ్యేష్ఠుడు గనుక అయ్యాధిపత్యము తనకొసంగు మనియు,



“గజాననుడు మరుగుజ్జువాడు, అనర్హుడు, అసమర్థుడు గనుక అయ్యాధిపత్యము తన కొసంగు”మని కుమార స్వామియు తండ్రిని వేడుకొనిరి.

శివుండక్కుమారులను జూచి, “మీలో నెవ్వరు ముల్లోకములందలి పుణ్యనదులలో స్నానమాడి ముందుగా నా యొద్దకు వచ్చెదరో, వారికీ యాధిపత్యం బొసంగుదు” నని మహేశ్వరుండు పలుక,

వల్లెయని సమ్మతించి కుమార స్వామి నెమలి వాహనంబు నెక్కి వాయు వేగంబున నేగె.

అంత గజాననుడు ఖిన్నుడై, తండ్రిని సమీపించి ప్రణమిల్లి “అయ్యా! నా అసమర్థత తామెరింగియు నిట్లానతీయదగునే! నీ పాదసేవకుడను నాయందు కటాక్షముంచి తగు నుపాయంబుదెల్పి రక్షింపవే” యని ప్రార్థింప–

మహేశ్వరుడు దయాళుడై, కుమారా! ఒక్కసారి “నారాయణ మంత్రంబు పఠించు”మని నారాయణ మంత్రాన్ని ఉపదేశించె.

**“సకృత్ నారాయణేత్యుక్త్వాపుమాన్ కల్పశతత్రయం**
**గంగాది సర్వతీర్థేషు స్నాతో భవతి పుత్రక”**

అంత గజాననుడు సంతసించి, అత్యంత భక్తితో నమ్మంత్రంబు జపించుచు కైలాసంబున నుండె.

అమ్మంత్ర ప్రభావంబున అంతకు పూర్వము గంగా నదికి స్నానమాడ నేగిన కుమారస్వామికి గజాననుడు ఆ నదిలో స్నానమాడి తన కెదురుగా వచ్చుచున్నట్లు గాన్పింప, నతండును మూడు కోట్ల ఏబది లక్షల నదులలో కూడ అటులనే చూచి ఆశ్చర్యపడుచు, కైలాసంబునకేగి తండ్రి సమీపమందున్న గజాననుని గాంచి, సమస్కరించి, తన బలమును నిందించుకుని– “తండ్రీ! అన్నగారి మహిమ తెలియకట్లంటిని క్షమింపుము. ఈ ఆధిపత్యంబు అన్నగారికే యొసంగు”మని ప్రార్థించెను.

అంత పరమేశ్వరునిచే భాద్రపద శుద్ధ చతుర్థినాడు గజాననునికి విఘ్నాధిపత్యం బొసంగబడియె.

ఆనాడు అందరూ విఘ్నేశ్వరుని తమ విభవముల కొలది కుడుములు, అప్పములు మొదలైన పిండివంటలు, టెంకాయలు, పాలు, తేనె, అరటిపండ్లు, పానకము, వడపప్పు మొదలైనవి సమర్పించి పూజింప..

విఘ్నేశ్వరుండు సంతుష్టుడై కుడుములు మున్నగునవి భక్షించియు, కొన్ని వాహనమున కొసంగియు, కొన్ని చేత ధరించియు మంద గమనంబున సూర్యాస్తమయం వేళకు కైలాసంబున కరిగి తల్లిదండ్రులకు ప్రణామంబు సేయబోవ ఉదరము భూమి కానిన చేతులు భూమి కందవయ్యే, బలవంతంబుగ చేతులానిన చరణంబులా కాశంబు జూచె.

ఇట్లు దండ ప్రణామంబుసేయ గడు శ్రమనొందుచుండ, శివుని శిరంబున వెలయు చంద్రుడు జూచి వికటంబుగ నవ్వె. అంత రాజ దృష్టి సోకి నరాలు కూడ నుగ్గగునను సామెత నిజమగునట్లు విఘ్నదేవుని గర్భంబు పగిలి అందున్న కుడుములు తత్ప్రదేశంబెల్లెడల దొర్లెను. అతండును మృతుండయ్యె.

పార్వతి శోకించుచు చంద్రుని జూచి, “పాపాత్ముడా! నీ దృష్టి తగిలి నా కుమారుడు మరణించెను గాన, నిన్ను చూచినవారు పాపాత్ములై నీలాపనిందలు నొందుదురుగాక” అని శపించెను.



ఆ సమయంబున సప్తమహర్షులు యజ్ఞంబు చేయుచు తమ భార్యలతో ప్రదక్షిణము చేయుచుండిరి. అగ్నిదేవుడు ఋషి పత్నులను చూచి మోహించి శాప భయంబున అశక్తుడై క్షీణించు చుండగా, నయ్యది అగ్ని భార్యయగు స్వాహాదేవి గ్రహించి, అరుంధతీ రూపము దక్క తక్కిన ఋషిపత్నుల రూపంబు తానే దాల్చి పతికి ప్రియంబు చేసె, ఋషులద్దానిఁగనుగొని అగ్నిదేవునితో నున్నవారు తమ భార్యలేయని శంకించి తమ భార్యలను విడనాడిరి.

## ఋషిపత్నులకు నీలాపనిందలు

పార్వతీ శాపానంతరము ఋషిపత్నులు చంద్రుని చూచుటచే వారికట్టి నీలాపనింద కలిగినది.

ఋషిపత్నుల యాపద పరమేష్ఠికి దెల్ప నాతండ సర్వజ్ఞుం



డగుటచే అగ్నిహోత్రునిభార్యయే ఋషిపత్నుల రూపంబు దాల్చి వచ్చుటం దెల్పి సప్త ఋషులను సమాధానపరచె. వారితో కూడా బ్రహ్మ కైలాసంబున కేతెంచి, ఉమామహేశ్వరుల సేవించి మృతుడై పడియున్న విఘ్నేశ్వరుని బ్రతికించి ముదంబుగూర్చె.

అంత దేవాదులు, "ఓ పార్వతీ దేవీ! నీ శాపంబున లోకంబులకెల్ల కీడు వాటిల్లుచున్నది. దాని నుపసంహరింపు" మని ప్రార్థింప, పార్వతి సంతసించి, "ఏ దినంబున విఘ్నేశ్వరుని చూచి చంద్రుడు నవ్వెనో నా దినంబున చంద్రుని జూడరాద"ని శాపోపశమనంబు నొసంగె.

అంత బ్రహ్మాదులు సంతసించి తమ గృహంబులకేగి, భాద్రపద శుద్ధ చతుర్థియందు చంద్రుని జూడక జాగరూకులై సుఖంబుగ నుండిరి.

## శమంతకోపాఖ్యానము

ద్వాపర యుగంబున ద్వారకా వాసియగు శ్రీకృష్ణుని నారదుడు దర్శించి, స్తుతించి ప్రియ సంభాషణములు జరుపుచు, "స్వామీ! సాయం సమయమయ్యె నేడు వినాయక చతుర్థి పార్వతీదేవి శాపంబుచే చంద్రుని జూడరాదు గాన నిజ గృహంబున కేగెద శెలవిండు!" అని పూర్వ వృత్తాంతమంతయు శ్రీకృష్ణునికి తెల్పి, నారదుడు స్వర్గలోకమున కేగెను.


అంత శ్రీకృష్ణుడు ఆనాటి రాత్రి చంద్రుని నెవ్వరూ చూడరాదని పురంబున చాటించెను.

నాటి రాత్రి శ్రీకృష్ణుడు క్షీర ప్రియుండుగాన, తాను మింటి వంక చూడక గోష్టమునకు బోయి పాలు పితుకుచు, పాలలో చంద్రుని ప్రతిబింబమును జూచి,"ఆహా! ఇక నాకెట్టి యపనింద రానున్నదో" యని సంశయమున నుండెను.



కొన్నాళ్లకు సత్రాజిత్తు అను రాజు సూర్యవరముచే శమంతక మణిని సంపాదించి, ద్వారకా పట్టణమునకు శ్రీకృష్ణ దర్శనార్థమై వచ్చెను. శ్రీకృష్ణుడాతనిని మర్యాదచేసి "ఆ మణిని తనకొసంగుమనెను" అతడది ఎనిమిది బారువుల బంగారము దినంబున కొసగునట్టిది, ఇట్టి మణిని ఏ మందమతియైన నివ్వడనిన, పోనిమ్మని శ్రీకృష్ణుడూరకొనెను.

అంత నొకనాడు సత్రాజిత్తు తమ్ముడు ప్రసేనుడు ఆ మణిని కంఠమున ధరించి వేటాడ నడవికి వెళ్ళగా ఒక సింహం అతని మెడలోని మణిని మాంసఖండమని భ్రమించి, అతణ్ణి చంపి ఆ మణిని తీసుకుపోవ దారిలో నొక భల్లూకం ఆ సింగమును దునిమి యా మణిని గొని తమ కుమార్తెకు ఆటవస్తువుగా ఒసంగెను.



మరునాడు సత్రాజిత్తు తమ్ముని మృతినాలించి, "కృష్ణుడు మణి ఇవ్వలేదని నా సోదరుని జంపి, రత్నమపహరించె"నని నగరమున చాటెను.

కృష్ణుడది విని నాడు క్షీరమున చంద్రబింబమును జూచిన దోష ఫలంబని ఎంచి దాని బాపుకొన బంధుసమేతుండై యరణ్యమునకు బోయి వెదకగా నొకచోట ప్రసేన కళేబరంబును, సింగపు కాలిజాడలను, భల్లూక చరణ విన్యాసంబులు గాన్పించెను. ఆ దారిపట్టి బోవుచుండ నొక పర్వత గుహాద్వారంబుజూచి, పరివారమును విడిచి కృష్ణుండు లోపలికేగి అచట బాలిక ఉయ్యాలపై కట్టబడియున్న మణిని జూచి అచ్చటికి బోయి, ఆ మణిని చేతపుచ్చుకుని వచ్చుచున్నంత ఉయ్యాలలోని బాలిక యేడ్వదొడంగెను.

అంత దాదియును వింత మానిసి వచ్చేననుచు కేకలు వేసెను.

అంతట జాంబవంతుడు రోషావేశుండై చనుదెంచి శ్రీకృష్ణుని పైబడి అరచుచు, నఖంబుల గ్రుచ్చుచు, కోరల గొఱకుచు, ఘోరముగా యుద్ధము చేయ, కృష్ణుడు వానింబడద్రోసి, వృక్షముల చేతను, రాళ్ల చేతను, తుదకు ముష్టిఘాతముల చేతను రాత్రింబవళ్ళు ఎడతెగక ఇరువదెనిమిది దినంబుల యుద్ధ మొనర్ప జాంబవంతుడు క్షీణబలుండై దేహం బెల్ల భీతి జెందుచు తన బలంబును హరింపజేసిన పురుషుండు రావణ సంహారియగు శ్రీరామచంద్రునిగా తలంచి, అంజలి ఘటించి–

"దేవాది దేవా! ఆర్తజనపోషా! భక్తజనరక్షా! నిన్ను శ్రీరామచంద్రునిగా నెఱిం గితి, ఆ కాలంబున నాయందలి వాత్సల్యముచే నన్ను వరంబు కోరుమని ఆజ్ఞ యొసంగ నా బుద్ధి మాంద్యంబున మీతో ద్వంద్వ యుద్ధంబు చేయవలెనని కోరుకొంటిని. కాలాంతరమున నది జరుగగలదని సెలవిచ్చితిరి. ఇప్పుడు నా కోరిక నెరవేర్చితిరి. నా శరీర మంతయు శిథిలమయ్యెను. ప్రాణములు కడబట్టె, జీవితేచ్ఛ నశించె, నా అపరాధములు క్షమించి కాపాడుమని ప్రార్థింప–

శ్రీకృష్ణుడు దయాళుడై జాంబవంతుని శరీరమంతయు తన హస్తంబున నిమిరి భయంబు బాపి, "భల్లూకేశ్వరా! శమంతకమణి నపహరించినట్లు నాపై ఆరోపించిన అపనింద బాపుగొన నిటు వచ్చితిని. గాన మణి నొసంగుము నేనేగెద" ననిన–

జాంబవంతుడు శ్రీకృష్ణునికి మణిసహితముగా తమ కుమార్తె యగు జాంబవతిని కానుకగా నొసంగెను.

అంత తన ఆలస్యమునకు పరితపించు బంధుమిత్ర సైన్యముల కానందంబు కలిగించె, కన్యారత్నముతోను, మణితోను శ్రీకృష్ణుడు పురంబుచేరి సత్రాజిత్తును రావించి, పిన్న పెద్దలను జేర్చి యావద్ వృత్తాంతమును చెప్పి శమంతకమణి నొసంగిన నా సత్రాజిత్తు "అయ్యో! లేనిపోని నిందమోపి దోషంబునకు పాల్పడితి"నని విచారించి మణిసహితముగా తన కూతురు సత్యభామను శ్రీకృష్ణునికి భార్యగా సమర్పించి, తప్పు క్షమింపుమని వేడుకొనెను.

శ్రీకృష్ణుడు సత్యభామను గైకొని మణి వలదని మరల నొసంగెను.

శ్రీకృష్ణుడు శుభ ముహూర్తమున జాంబవతీ, సత్యభామలను పరిణయంబాడ నచ్చటికి వచ్చిన దేవాదులు, మునులు స్తుతించి, మీరు సమర్థులు గనుక నీలాపనింద బాపుకొంటిరి. మాకేమి గతి యని' ప్రార్థింప, శ్రీకృష్ణుడు దయాళుడై భాద్రపద శుద్ధ చతుర్థిని ప్రమాదంబు చంద్ర దర్శనమయ్యేనేనీ ఆనాడు గణపతిని యథావిధిగా పూజించి ఈ శమంతకమణి కథను విని అక్షతలు శిరంబున దాల్చువారు నీలాప నింద నొందకుండెదరు గాక! అని ఆనతీయ దేవాదులు సంతసించి తమ నివాసంబుల కరిగిరి.

ఇట్లు సూత మునీంద్రుడు గణాధిపతి శాపమోక్ష వృత్తాంతంబు శౌనకాది మునులకు వినిపించి వారిని తోడ్కొని నిజాశ్రమంబున కరిగెను.

**చంద్ర దర్శన దోషశాంతి శ్లోకం**

వినాయక చతుర్థినాడు చంద్రుని చూడరాదు. పొరపా టున చూసినచో విష్ణుపురాణములోని ఈ కింది శ్లోకమును చదివితే ఆ దోషం తొలగిపోతుందని నిర్ణయ సింధువులో చెప్పబడినది.

శ్లో॥ సింహః ప్రసేన మవధీత్ సింహోజాంబవతా హతః ।
సుకుమారక మారోదీః తవ హ్యేషస్స్య మంతకః ॥

శ్లో॥ గణేశః ప్రతిగృహ్ణాతు గణేశో వైదదాతి చ

## వాయన దానము

గణేశః తారకోభాభ్యాం గణేశాయ నమో నమః

*(ఈ శ్లోకము వాయనమిచ్చువారు చెప్పవలెను)*

మంత్రము - దేవస్యత్వాసవితుః ప్రసవేశ్వినోర్బాహుభ్యాం పూష్ణోహస్తాభ్యామా దదా !


**(ఈ మంత్రము వాయనం పుచ్చుకొనువారు చెప్పవలెను)**

**(పూజ చేసినవారు ఈ కింది శ్లోకములను చెప్తూ ఆత్మప్రదక్షిణ నమస్కారము చేయవలెను)**

శ్లో॥ యానికానిచ పాపాని జన్మాంతర కృతాని చ
తానితాని ప్రణశ్యన్తి ప్రదక్షిణ పదే పదే
పాపోహం పాప కర్మాణాం పాపాత్మా పాప సంభవః
త్రాహిమాం కృపయా దేవ శరణాగత వత్సల
అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ
తస్మాత్కారుణ్య భావేన రక్షరక్ష వినాయక ॥

॥ సర్వేజనాస్సుఖినో భవంతు ॥

వినాయకుని వ్రతకల్పం సమాప్తం



# విఘ్నేశ్వరుని కళ్యాణం

వినాయకుని వివాహం గురించి పౌరాణిక గాథ... ప్రళయవేళ శ్రీ మహావిష్ణువు నాభి నుంచి వచ్చిన తామరపువ్వుపై బ్రహ్మ అవతరిం చాడు. ప్రళయానంతరం విష్ణువు మేల్కొని జీవసృష్టి



కార్యకలాపాన్ని ప్రారంభించమని తన కొడుకైన బ్రహ్మను ఆదేశించాడు.

బ్రహ్మ సృష్టి ఆరంభించాడు. కానీ అంతా వక్రంగా వుంది. అప్పటికి ఎన్నో కల్పాలలో సృష్టి చేస్తూ వస్తున్న బ్రహ్మకు ఈ పరిణామం ఆశ్చర్యం కలిగించింది. ఆలోచనలో పడ్డాడు.

అప్పుడు నారదుడు కార్యారంభా నికి ముందు వినాయక పూజ చేయనందువల్లే ఈ వైకల్పికం వచ్చిందని గణేశార్చన చేయమని బ్రహ్మకు బోధించాడు.

బ్రహ్మ వినాయకుని కోసం కఠోర తపస్సు చేశాడు. వినాయకుడు ప్రత్యక్షమై బ్రహ్మ ఆంతర్యాన్ని గ్రహించి జ్ఞానం, క్రియలనే శక్తులను ఉపాసించమని బోధించాడు. బ్రహ్మ ఆ ఉపాసన చేశాడు. అప్పుడు ఆ రెండు శక్తులు సిద్ధి, బుద్ధి అనే రూపాలతో ప్రత్యక్షమయ్యాయి. బ్రహ్మ కోరిక మేరకు వారిద్దరు ఆయన కుమార్తెలుగా జన్మించారు. ఆ తరువాత బ్రహ్మ చేసిన సృష్టి సక్రమముగా కొనసాగింది. సిద్ధిబుద్ధులు యౌవనవతులయ్యారు. వారి వివాహం చేయాలని బ్రహ్మ సంకల్పించాడు. ఈలోగా నారదుడు కథ నడిపి సిద్ధిబుద్ధులు గణేశుని కోరుతున్నారని ఆయనకు చెప్పాడు. అందుకు వినాయకుడు అంగీకరించాడు. తరువాత గణేశుడు మిమ్మల్ని కోరుతున్నాడని వాళ్లిద్దరికీ చెప్పాడు.

బ్రహ్మ సమక్షంలో వినాయకుడికి పెళ్ళి జరిగింది. నూతన వధూవరులను ఆశీర్వదించి నారదుడు వినాయకుని వైపు ఆశ్చర్యంగా చూశాడు.

అతని ఆంతర్యాన్ని గ్రహించిన వినాయకుడు నారదా! మా మధ్య కలహం వస్తుందని నీవు భావించావు. ఈ సిద్ధి బుద్ధి ఎవరో కాదు, నా ఆంతరంగిక శక్తులైన జ్ఞానం, క్రియ. అందుకే మేం మళ్ళీ ఒకటయ్యాం. నీ కలహ చింతన లోకా నికి ఉపకారమైంది. భవిష్యత్‌లో మానవుడు సిద్ధి బుద్ధి సమేతుడనైన నన్ను ఆరాధిస్తే వారికి విఘ్నా లన్నీ తొలగి సుఖశాంతులు పొందుతారని చెప్పాడు. ఇదీ వినాయకుడి పెళ్ళి కథ ఆంతర్యం. •



# అష్టవినాయక క్షేత్రాలు

మహారాష్ట్రలోని స్వయంభూ క్షేత్రాలైన అష్ట వినాయకులను ఒకే ట్రిప్పులో దర్శించాలని అంటారు. దేనికదే ఎంతో విశిష్టమైన వినాయక క్షేత్రాలివి.



## మయూర గణపతి

అష్ట వినాయకులలో ముందుగా బారమతి తాలూకాలోని మోర్‌గావ్ గ్రామంలో వెలసిన మయూరేశ్వరుణ్ణి దర్శించాలి. ఇక్కడ వినాయకుడు మూషిక వాహనం మీద కాకుండా మయూరాసనుడై దర్శనమిస్తారు.

పూర్వ సింధురాసురుడు అనే రాక్షసుడు ఈ ప్రాంత ప్రజలను తీవ్రంగా హింసిస్తుంటే మునులు దేవతలను వేడుకోగా వినాయకుడు మయూరాసనుడై వచ్చి ఆ రాక్షసుణ్ణి సంహరించాడట. అందువల్ల ఇక్కడ స్వామిని మోరేశ్వర్ అంటారు. పాండవులు ఈ వినాయకుణ్ణి పూజించారని, అసలైన ఆ ప్రతిమ ప్రస్తుత విగ్రహానికి వెనుక ఉందని అంటారు. ఈ ఆలయాన్ని బహమనీల కాలంలో నిర్మించారు. అసుర సంహారం గావించిన స్వామి కనుక ఈ క్షేత్రంలో వినాయక చవితితో పాటు విజయదశమి వేడుకలను సైతం వైభవంగా జరుపుతారు.

## బల్లాల్లేశ్వరుడు

పాలిలోని బల్లాల్లేశ్వరుడు ఓ భక్తుడి పేరుతో వెలిశాడు. పల్లి పుర్‌కి చెందిన కల్యాణ్ సేఠ్ కొడుకైన బల్లాల్, స్నేహితులతో కలిసి అడవిలోకి వెళ్లి, ఓ రాతి వినాయకుణ్ణి ప్రతిరోజూ పూజించేవాడట. దాంతో రోజూ ఆలస్యంగా ఇంటికి వస్తున్న పిల్లల్ని చూసి తల్లిదండ్రులు సేఠ్‌కి చెప్పగా, కోపం పట్టలేక అతను పిల్లాణ్ణి చెట్టుకి కట్టేసి కొట్టాడట. అపస్మారక స్థితిలోనూ బల్లాల్ గణేశుణ్ణే స్మరించగా, స్వామి ప్రత్యక్షమై కట్లు విడిపించి, ఆ బాలుడి కోరిక మేరకు అక్కడే ఉన్న ఓ పెద్దరాతిలో ఐక్యమయ్యాడనీ, ప్రస్తుతం ఆలయంలోని విగ్రహం అదేనని అంటారు. విగ్రహ రూపం కూడా ఆలయానికి వెనక ఉన్న కొండను పోలి వుండటం విశేషం. ఇక్కడి వినాయకుడికి మోదకాలు కాకుండా బేసన్‌లడ్డూ ప్రసాదంగా పెడతారు. పూర్వ కాలంనాటి చెక్క ఆలయాన్ని తరువాత రాతి ఆలయంగా నిర్మించారు. దీనికి వెనుక దుండి వినాయక ఆలయం ఉంటుంది. బల్లాల్ తండ్రి విసిరికొట్టిన విగ్రహమే ఈ దుండి వినాయకుడు. అందుకే అక్కడ స్వామి పడమట దిశగా ఉంటాడు. భక్తులు ముందుగా దీన్ని దర్శించాకే బల్లాల్ విగ్రహాన్ని పూజిస్తారు.

## చింతామణి గణపతి


పూణెకి ఇరవై కిలోమీటర్ల దూరంలో థేవూర్ అనే గ్రామంలో ఉందీ ఆలయం. పూర్వం కపిల మహాముని దగ్గర భక్తుల కోరికను నెరవేర్చే చింతామణి ఉండేదట. ఓసారి ఆ ప్రాంతాన్ని పాలించే అభిజిత్ మహారాజు కొడుకు గుణ ఆశ్రమానికి వచ్చినప్పుడు ఆ మణి ప్రాశస్త్యాన్ని గుర్తించి, దాన్ని అపహరిస్తాడు. అప్పుడు ఆ ముని గణపతి సహాయంతో యుద్ధం చేసి తిరిగి మణిని పొంది, కదంబం చెట్టు కింద ఉన్న వినాయకుడి మెడను అలంకరింపజేసాడట. అప్పటి నుంచి ఆ ఊరు కదంబ నగర్‌గా, స్వామి చింతమణి వినాయకుడిగా పేరు గాంచాడు. పేష్వాల కాలంలో ఈ దేవాలయాన్ని నిర్మించారు.

## విఘ్నహరుడు

కుకడి నదీ తీరంలో ఓఝూర్ పట్టణంలో కొలువయ్యాడు విఘ్నహరుడు. ఆలయ శిఖరం బంగారు పూతతో మెరుస్తుంటుంది. పూర్వం ఈ ప్రాంతంలో విఘ్నాసురుడు అనే రాక్షసుడు మునులను హింసించేవాడట. అప్పుడు వాళ్లు ఏకదంతుణ్ణి వేడుకోగా–









రాక్షసుడితో యుద్ధం చేస్తాడు. వినాయకుడితో గెలవలేని ఆ అసురుడు, శరణు కోరి తన పేరు మీద స్వామిని అక్కడే కొలువుండాలని కోరతాడు. అందుకే ఇక్కడి గణేశుణ్ణి శ్రీ విఘ్నేశ్వర్, విఘ్నహార్ వినాయక్ అని పలుస్తారు. అప్పట్లో మునులు స్వామికి కట్టించిన ఆలయాన్ని తరువాతి కాలంలో పునర్నిర్మించాడట.



## సిద్ధివినాయకుడు

గణేశుడు ఈ క్షేత్రంలో కుడివైపు తొండంతో దర్శనమిస్తాడు. ఈ లంబోదరుణ్ణి విష్ణుమూర్తే స్వయంగా ప్రతిష్ఠించి, ఆలయం నిర్మించాడని స్థల పురాణం. పూర్వం శ్రీమహావిష్ణువు మధుకైటభులనే రాక్షసులను అంతమొందించేందుకు వినాయకుడి సాయాన్ని తీసుకున్నారట, అందుకు ప్రతిగా సృష్టించిందే ఈ ఆలయం.



అహ్మద్‌నగర్ జిల్లాలోని శ్రీగొండ పట్టణ సమీపంలోని చిన్న కొండ మీద ఉన్న ఈ ఆలయాన్ని తరువాత పేష్వాలు నిర్మించారు. ఇక్కడ వినాయకుడికి ఒక్క ప్రదక్షిణ చేయాలంటే కొండ చుట్టూ తిరగాలి. సుమారు ముప్ఫై నిమిషాలు పడు తుంది. కార్యసిద్ధి వినాయకుడిగా భావించి, భక్తులు ప్రదక్షిణలు చేసి తమ మొక్కును తీర్చుకుంటారు.

## వరద వినాయకుడు

పుణెకి సుమారు ఎనభై కిలోమీటర్ల దూరంలోని మహద్ క్షేత్రంలో వెలిసిన స్వామి వరద వినాయకుడు. పూర్వం ఈ ప్రాంతాన్ని పాలించిన రుక్మాంగదుడనే మహారాజు ఓసారి ఈ గ్రామంలోని వాచక్నవి రుషి దర్శనార్థం వచ్చాడట. రుషిపత్ని ముకుంద రాజుని చూసి మనసు పడుతుంది.

రాజు తిరస్కరించి వెళ్లిపోతాడు. అప్పుడు ఇంద్రుడు రాజు రూపంలో వచ్చాడట. ఆ కలయిక వల్ల గృత్సమధుడు పుడతాడు. పెరిగి పెద్దయ్యాక తన జన్మ రహస్యాన్ని తెలుసు కుని, అందరి పాపాలు తొలగిపోయేందుకు గణపతిని ప్రార్థించా డట. ఆ భక్తికి మెచ్చి అక్కడే స్వయంభువుగా వెలసి వరద వినాయకుడుగా ప్రసిద్ధుడయ్యాడు. ఈ ఆలయంలోని దీపం అఖండంగా వెలుగుతూ ఉంటుంది. భక్తులు స్వయంగా స్వామికి తమ కానుకలు సమర్పించుకునే వెసులుబాటు ఉండటం ఆ ఆలయం ప్రత్యేకత.

## గిరిజాత్మజ్ వినాయక్

లేహ్యాద్రి పర్వతం మీద బౌద్ధ గుహల సముదాయంలో కొలువుదీరాడు ఈ గిరిజాత్మజుడు. పుణెకి తొంభై కిలోమీటర్ల దూరంలోని వున్న ఈ ఆలయం సందర్శించాలంటే సుమారు మూడు వందల మెట్లు ఎక్కాలి. స్తంభాలు లేకుండా ఏక రాతికొండనే ఆలయంగా మలిచి మెట్లు నిర్మించారు. పుత్రుడి కోసం దాదాపు పన్నెండేళ్లు తపస్సు చేసి, తరువాత నలుగుపిండితో చేసిన బాల గణపతికి ప్రాణం పోస్తుంది పార్వతీదేవి. కౌమార ప్రాయం వచ్చే వరకు తల్లితో కలిసి ఇక్కడే ఉన్నాడని పౌరాణిక ప్రాశస్త్యం. విద్యుద్దీపాల అవసరం లేకుండా పగటివేళలో సూర్యకాంతి గుడిలోపల పడేలా ఈ ఆలయాన్ని నిర్మించడం విశేషం.

## మహాగణపతి

తన వరసిద్ధి ప్రభావంతో లోకకంట కుడుగా మారిన త్రిపురాసురుణ్ణి అంతమొందించేందుకు విఘ్నాధిపతి అయిన తన కుమారుణ్ని తలచుకుని యుద్ధం చేసి, ఆ రాక్షసుణ్ణి సంహరిస్తాడు పరమశివుడు. ప్రతిగా ఆ హరుడే స్వయంగా ఇక్కడ మహాగణపతిని ప్రతిష్ఠించాడని గణేశ పురాణం వల్ల తెలుస్తోంది. దక్షిణాయనంలో సూర్యకిరణాలు నేరుగా విగ్రహం మీద పడేలా నిర్మించిన ఈ ఆలయాన్ని తిరిగి 18వ శతాబ్దంలో పేష్వాలు పునర్నిర్మించారు. ఒకప్పుడు మణిపుర్‌గా పిలిచే ఈ ప్రాంతాన్ని ఇప్పుడు రంజన్‌గావ్‌గా పిలుస్తున్నారు. ●







# నిమజ్జనం ఎందుకు చేస్తారు?

**దేశ వ్యాప్తంగా వినాయక చవితి ఉత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలు, మహారాష్ట్రలో వినాయక చవితి వేడుకలు యువత, పిల్లల హడావుడి చెప్పనక్కర్లేదు.**

తొమ్మిది రోజులు జరిగే గణేష్ నవరాత్రోత్సవాలు ఒక ఎత్తయితే నిమజ్జనోత్సవం మరో ఎత్తు. ఇలా వినాయకుని ప్రతిమలను నిమజ్జనం చేయడం వెనుక అనేక కారణాలు ఉన్నాయి.

వినాయక చవితి వర్షా కాల ప్రారంభంలో వస్తుంది. వర్షాకాలం ప్రారంభానికి ముందే చెరువుల నుంచి మట్టి సేకరించి, ఆ మట్టితో విగ్రహాలు చేసి వాటిని పూజించిన తర్వాత తిరిగి చెరువులలో, నదులలో ప్రవహించే నీటిలో నిమజ్జనం చేస్తారు.

## మట్టి తీస్తే...

చెరువులలో విగ్రహాల కోసం మట్టిని తీయడం వల్ల చెరువుల్లో లోతు పెరుగుతుంది. ఆ తర్వాత ఆయుర్వేద గుణాలున్న పత్రితో కలిసి విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల నీరు సులువుగా పారే అవకాశం ఉంటుంది. అదే సమయంలో అందులో ఆయుర్వేద గుణాలు కూడా కలుస్తాయి.

## ఆరోగ్య సమస్యలు రాకుండా..

ఇలాంటి నీటిని తాగడం వల్ల ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావని చాలా మంది నమ్మకం. ఎందుకంటే విగ్రహాలను తయారు చేసేందుకు ఉపయోగించిన మట్టి, పత్రి, గరిక ఇతర వస్తువుల వల్ల నీటిలో ఉండే క్రిమికీటకాలన్నీ చనిపోతాయి. దీని వల్ల నీరు శుద్ధి అవుతుంది.

## పౌరాణిక కథ

వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయడం వెనుక పౌరాణిక కారణాలు కూడా ఉన్నాయి. పురాణాల ప్రకారం వినాయకుడు కైలాసం నుండి భూలోకానికి వచ్చి పది రోజులు ఉండి, తిరిగి కైలాసానికి వెళ్లిపోతాడు.

భూలోకానికి వచ్చిన వినాయకుడు పది రోజుల పాటు కైలాసానికి దూరంగా ఉంటాడని, పది రోజుల ప్రతి రోజూ పూజలందుకుని, తిరిగి కైలాసానికి రమ్మని పార్వతీదేవి పంపినట్లు పెద్దలు చెప్పుంటారు.



# విభిన్న రూపాలతో పూజలందుకునే గణపతి

విఘ్నాలను తొలగించేవాడిగా, కళలకు, శాస్త్రాలకు అధిపతిగా, బుద్ధికి జ్ఞానికి ఆద్యుడుగా భావించి గణపతిని పూజిస్తుంటారు. ఏ పూజ చేసినా ప్రథమ పూజ గణపతికే.

వినాయకుని ఆకారంపై ఎన్నో అభిప్రాయాలు, తత్వార్థ వివరణలు, కథలు ఉన్నాయి. ఏనుగుతొండం, పెద్ద బొజ్జ, ఎలుక వాహనం.. ఇవీ ప్రధానంగా కనిపించే వినాయకుడి స్వరూప విశేషాలు. గణేశుని ఆకారం దేవనాగర లిపిలో ఓం (ప్రణవం)ను పోలి వుందని చెబుతారు. వినాయకుని తొండం ఓంకారానికి సంకేతమని చెబుతారు. ఏనుగుతల జ్ఞానానికి, యోగానికి చిహ్నం. మనిషి శరీరం మాయకు, ప్రకృతికి చిహ్నం. చేతిలో పరశువు విఘ్నాలను కట్టడి చేసే సాధనం. విరిగిన దంతం త్యాగానికి ప్రతీక, జపమాల జ్ఞాన సముపార్జనకు, పెద్ద చెవులు మొక్కులు వినే కరుణకు పొట్టపై నాగబంధం, శక్తికి, కుండలినికి సంకేతం. ఎలుకవాహనం జ్ఞానానికి అన్ని జీవుల పట్ల సమభావం ఉండాలి అని తెలిపే సంకేతం. కుండలినీ యోగం ప్రకారం షట్చక్రాలలో మొదటిదైన మూలాధార చక్రానికి అధిపతి వినాయకుడు. బాల గణపతి, భక్త గణపతి, ధ్వజ గణపతి, విఘ్నరాజ గణపతి, తరుణ గణపతి, నృత్త గణపతి, ఊర్ధ్వ గణపతి, విజయ గణపతి మొదలైన పేర్లు ఆయా స్వరూప లక్షణాలను, ఉపాసనను బట్టి వాడుకలో ఉన్నాయి.



హేరంబ గణపతి ఐదు తలలతో, విరిగిన దంతాన్ని చేతపట్టుకొన్న స్వామి ఏకదంతుడుగా, భూత, భవిష్యత్, వర్తమాన కాలాలకు చెందిన సకల జగత్తు తన ఉదరంలో ఉంచుకొన్నందున లంబోదరునిగా పేరు వచ్చిందని బ్రహ్మాండ పురాణంలో ఉంది. గణేశ పురాణం ప్రకారం వినాయకుడు పామును యజ్ఞోపవీతంగా చుట్టుకున్నాడు. వినాయకుని నుదుటి మీద తిలకం లేదా కొన్ని సార్లు మూడవ నేత్రం చిత్రిస్తారు. బాలచంద్ర వినాయకుడు అనే రూపంలో చంద్రవంకను తలపై చిత్రిస్తారు. వినాయకుణ్ణి వివిధ రూపాల్లో వివిధ వర్ణాల్లో చిత్రిస్తారు. వీటి గురించి శ్రీ తత్వనిధి అనే శిల్ప గ్రంథంలో ప్రస్తావించారు. వేదాలను విభజించిన వేదవ్యాసుడు పంచమ వేదమైన మహా భారతాన్ని రాయడానికి సంకల్పించాడు. తాను చెప్తూ వుంటే రాయగల సమర్థుని కోసం గణపతిని ప్రార్థించాడు. గణపతి ఒక నియమం విధించాడు. ఆ నియమం ఏమిటంటే వ్యాసుడు ఎక్కడా ఆపకుండా చెప్పాలి. దానికి అంగీకరించి వ్యాసుడు కూడా ఒక నియమం విధించాడు. తాను చెప్పినదానిని గణపతి పూర్తిగా అర్థం చేసుకొన్న తరువాతే రాయాలి. అలా ఒప్పందం ప్రకారం భారత కథా రచన సాగింది. చరిత్ర ప్రకారం గుప్తుల కాలం నాటికే వినాయక విగ్రహాలు ఉన్నాయి. నేపాల్‌లో రక్త గణపతి ఆలయం, జావాలో కపాలిక ఆలయం, టిబెట్‌లో బుద్ధ గణపతి ఆలయం.. ఇలా వివిధ ప్రదేశాల్లో వినాయక మూర్తులను చూడవచ్చు. హిందువులు సముద్రయానం చేసేటప్పుడు మొదట వినాయకుని పూజించేవారు. బర్మా, సయాం, ఇండోనేషియా, చైనా దేశాల్లో వారు స్థిరపడి అక్కడ గణపతిని ప్రతిష్ఠ చేయటం వల్ల వివిధ దేశాల్లో వినాయకుని పూజలకు అవకాశం కలిగింది. పసిఫిక్ సముద్ర ద్వీపాల్లో, జావా, బోర్నియాల్లోనూ ఈ స్వామిని పూజిస్తారు. దేశంలో కొన్ని మందిరాల్లో వినాయకుణ్ణి ప్రధాన దేవతగా ఆరాధిస్తుంటే కొన్ని దేవాలయాల్లో ఉపాలయాలు, అంతరాలయాల్లో వినాయకునికి పూజలు జరుగుతుంటాయి. కోటలు, రాజప్రాసాదాలు, ఇళ్లు, వీధులు, రావిచెట్టు.. ఇలా అనేక స్థానాల్లో గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తుంటారు. మహారాష్ట్రలో అష్ట వినాయక ఆలయాలు పూణెకు చుట్టుపక్కల ఉన్నాయి.

గణేశ చతుర్థిని మొదటగా ఎప్పుడు ఆచరించారో తెలియకపోయినప్పటికీ మరాఠ సామ్రాజ్య స్థాపకుడు శివాజీ కాలం నుండే పూణెలో పండుగను బహిరంగంగా జరుపుకునేవారు. తరువాత బ్రిటీష్‌వాళ్ల పరిపాలనా కాలంలో సభలు, సమావేశాలు, ఊరేగింపులు.. ఇలాంటి వాటిపై నిషేధం విధించారు. భారతీయులు కలిసికట్టుగా ఉండాలనే ఉద్దేశంతో భారతీయ స్వాతంత్ర్య సమరయోధుడు లోకమాన్య బాలగంగాధర తిలక్ మహాశయుడు ఒక పెద్ద వినాయకుని బొమ్మను తీసుకువచ్చి బహిరంగ మైదానంలో ఉంచి సామూహికంగా అందరిచేత పూజ చేయించి మేళ తాళాలతో ఊరేగించి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఇలా ప్రారంభమై దేశ విదేశాల్లో వినాయక చవితి వేడుకలు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. వినాయక చవితి రోజున గణపతి పూజ, ఉపాసన చేస్తే విశేష ఫలాన్నిస్తాయి. శీఘ్రంగా అనుగ్రహించి అభీష్టాలనిచ్చే దయామయుడు గణపతి. మట్టితో చేసిన గణపతి విగ్రహాన్ని విధి విధానంగా పూజించి గరిక, మారేడు మొదలైన 21 రకాల పత్రులతో పూజించాలి. గణేశ పూజలో పత్రికి ప్రాధాన్యం ఎక్కువ. అన్ని రకాల సంప్రదాయ పూజలలో, అన్ని ప్రాంతాల్లో వినాయకుని పూజ జరుగుతుంది.

ఓం శ్రీ గణేశాయ నమః, ఓం గం గణప తయే నమః మొదలైన ప్రార్థనా మంత్రాలను ఉచ్ఛరిస్తూ గణపతికి శోడశోపచార పూజలు చేసి నైవేద్యం సమర్పిస్తారు. వినాయకునికి ఉండ్రాళ్లు, లడ్డూలు వంటి నైవేద్యాలు సమర్పిస్తారు. తెలుగు ప్రాంతాల్లో పానకం, బెల్లం, అటుకులు, వడపప్పు, ఉండ్రాళ్లు, పాలతాలికలు, కుడుములు మొదలైన వివిధ రకాల పిండివంటలను నివేదన చేస్తారు.

ప్రతి ఇంట్లో, వీధి కూడళ్లలో మట్టితో చేసిన వినాయకుణ్ణి ప్రతిమను మండపంలో ఉంచి ప్రాణ ప్రతిష్ఠ చేసి వివిధ రకాల పత్రితో వివిధ రకాల నైవేద్యాలతో ఆరాధి స్తారు. వీధి వీధినా గణపతి ప్రతిష్ఠ, సామూహిక ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరుగుతాయి. తొమ్మిది రోజులు ఉత్సవాల తరువాత పదవ రోజు అంటే ఉత్సవ విగ్రహాల నిమజ్జనం ఉంటుంది.

**- ఆర్‌ఎల్**

# గణపతి మెచ్చే ఉండ్రాళ్లు

## మోదక్

గణేశుడికి అత్యంత ఇష్టమైన తీపి పదార్థాల్లో మోదక్ ఒకటి. ఎక్కువ తీపి



ఇష్టపడనివాళ్లు కొబ్బరి, బెల్లం వాడకాన్ని నివారించవచ్చు. దానికి బదులుగా బీట్‌రూట్, నట్స్, ముక్కలు పండ్లు లేదా వోట్స్‌తో మోదక్ లోపల కూరటానికి తయారు చేయవచ్చు. ఈ పదార్థాలు శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. అలాగే మొక్కజొన్న పిండి లేదా బియ్యం పిండికి బదులుగా డీహైడ్రేషన్ కోసం పండ్లు, పండ్ల గుజ్జును బయటి కవర్‌గా ఎంచుకోవచ్చు.

## పూరన్ పోలి

**పూ**రన్ పోలి అనేది మహారాష్ట్ర వంటకాల్లో నోరూరించే ప్రామాణికమైన వంటకం. ముఖ్యంగా గణేష్ చతుర్థి సమయంలో వండుతారు. ఇది సెనగపప్పు, బెల్లం, తురిమిన కొబ్బరి, ఏలకులతో చేసే తీపి వంటకం. మనందరికీ తెలిసినట్లుగా దాల్ ప్రొటీన్‌కు అధిక మూలం. కనుక దీనిని ప్రసాదంగా చేయటం మంచి ఎంపిక.



## మోతిచూర్ లడ్డు

**మో**దక్ తరువాత గణేష్ పూజా సమయంలో మోతిచూర్ లడ్డూ ప్రత్యేక ప్రాముఖ్యం కలిగి వుంది. గణేష్ అత్యంత ఇష్టపడే



ఆహారాలలో ఇది ఒకటి అని అంటారు. ఇది శెనగపిండి, పంచదారతో తయారు చేస్తారు. డయాబెటిక్ వ్యక్తులు ఈ లడ్డూ తినాలనుకుంటే చక్కెర రహిత పొడితో భర్తీ చేయండి. అదనపు గ్లూకోజ్ తీసుకోకుండా కచ్చితమైన తీపిని ఇస్తుంది.

## పాథోలి



**పా**థోలి కొబ్బరి, బెల్లం కూరటానికి ఉడికించిన బియ్యం రోల్స్, అరటి ఆకులలో ఆవిరి పట్టిస్తారు. బియ్యం కార్బోహైడ్రేట్స్‌కు గొప్ప మూలం. ఇది మన శక్తి స్థాయిని పెంచడానికి అవసరం. అలాగే, అరటిఆకులో క్రిమినాశక లక్షణాలు ఉన్నాయి. అది శరీరా నికి చేరుకున్న తర్వాత, ఏదైనా వ్యాధితో పోరాడుతుంది, అనారోగ్యానికి గురి కాకుండా చేస్తుంది. అయితే ప్రసాదం ఆరోగ్యం ఉండటానికి, దాని నాణ్యతను పెంచడానికి కొబ్బరి లేదా నట్స్‌కు బదులుగా కూరగాయలను వాడుకోవచ్చు.

## కర్జికాయ



## మూంగ్ దాల్ కా హల్వా



కొబ్బరి, బెల్లం కూరటానికి పిండితో చేసిన వేయించిన తీపి వంటకం కర్జికాయ. పోషక విలువలు కలిగిన ఓట్స్ లేదా బీట్ రూట్ వంటి వాటిని కూరటానికి ఎంచుకోవడం ద్వారా ఆరోగ్య కరమైన ప్రయోజనాలను మెరుగుపరచుకోవచ్చు. గుండె జబ్బులు, అధిక కొలెస్ట్రాల్‌తో బాధపడేవారు వేయించిన ఆహారం తీసుకోకపో వడం మంచిది. కనుక దాని ఆరోగ్య ప్రయోజనాలను నిలుపుకోవ టానికి ఆవిరి మీద తయారు చేయడం ఉత్తమం.

పెసరపప్పులో ప్రొటీన్‌లు అధికంగా ఉన్నాయి. ప్రతిరోజూ దానిని తినడం వల్ల రోజువారీ ప్రొటీన్ అవసరాలకు సరిపోతుంది. మూంగ్ దాల్ కా హల్వా మూంగ్‌దాల్, చక్కెర, డ్రై నట్స్‌తో చేసిన తీపి వంటకం. కేలరీలను తగ్గించడానికి, చక్కెర లేదా చక్కెర పొడర్‌ను ఉపయోగించవచ్చు.

డయాబెటిక్ రోగులకు హానికరం కనుక చింత లేకుండా తినడానికి ప్రత్యామ్నాయం ఎంచుకోండి. ✦

# గణేశ పూజలో గరిక ప్రాముఖ్యత

**పుష్పజాతులు** దెచ్చి పూజింప లేకున్న గరిక పూజను మెచ్చు ఘనుడె వండు? అని కంచర్ల సూర్యనారాయణ కవి గణపతిని గురించి ప్రస్తావించారు.

వినాయక చవితికి విఘ్నేశ్వరుణ్ణి అర్చించే 21 రకాల పత్రిలో గరికకు ఉత్తమ స్థానం ఉంది. గరికను దూర్వా యుగ్మం అని కూడా పిలుస్తారు. 21 రకాల పత్రి, తరువాత పరిమళభరిత పుష్పాలతో గణపతిని పూజించినా దూర్వాయుగ్మ పూజ తప్పనిసరి. రెండు గరిక పోచలను దేమునికి సమర్పిం చినా గణేశుడు ప్రీతికరంగా స్వీకరించి అందరికీ శుభాలను కలుగజేస్తాడు. దర్భలు దొరకని పరిస్థితుల్లో ప్రత్యామ్నాయంగా గరికను ఉపయోగిస్తారు.

గణేశుడు భక్తసులభుడు. ఆయనను ప్రసన్నం చేసుకునేందుకు బంగారు పుష్పాలు అవసరం లేదు. ఆ మాటకు వస్తే అసలు పుష్పాలు లేకున్నా పరవాలేదు. భక్తితో గరికను సమర్పిస్తే చాలు.. మన మనసులోని కోరికలను నెరవేరుస్తాడు. భక్తసులభుడైన గణపతి పూజకి మూర్తి లేకున్నా పసుపుముద్దతో గణేశుణ్ణి చేసి ఆరాధించినా వరాలను ఇచ్చే అభయప్రదాత వినాయకుడు.

### గరికకు ఎందుకు ప్రాధాన్యం

పూర్వం అనలాసురుడనే రాక్షసుడు తన రాక్షస ప్రవృత్తితో అందరినీ హింసించ సాగాడు. అతడు అగ్నిస్వరూపుడు. తన కంటికి ఎదురుగా వచ్చిన దేనినైనా బూడిద చేయగల సమర్థుడు. అనలాసురుని బారి నుండి తప్పించుకునేందుకు మార్గాలన్నీ



మూసుకుపోగా, దేవేంద్రుడు వినాయకుని శరణు కోరాడు.

తన తండ్రి పరమేశ్వరుడు గరళాన్ని మింగినట్లుగానే వినాయకుడు అనలాసు రుణ్ణి మింగేసాడు.

అగ్నితత్వంగల అనలాసురుని మింగడం వల్ల వినాయకుని ఉదరంలో తాపం కలిగింది. ఎన్ని ఔషధాలు వాడినా తాపం తగ్గలేదు. చివరకు పరమేశ్వరుని సలహా మేరకు 21 గరికలను ఆయన శరీరం మీద కప్పడంతో ఆ తాపం తగ్గిందని ఒక కథ ప్రాచుర్యంలో ఉంది.

అందువ్ల గణేశుని పూజలో ఉపయో గించే పత్రిలో గరికకు అంత ప్రాధాన్యం. తమిళనాడులో వాడవాడలో కనిపించే గణేశుని ఆలయాల్లో స్వామికి గరికను ప్రతిరోజూ సమర్పిస్తారు.

గరిక త్రిదోషాలను హరిస్తుంది. దూర్వాసూక్తంలో తెలిపిన విధంగా

**"సహస్ర పరమాదేవి శతమూలా**
**శతాంకురా సర్వగుం హరతుమే పాపం**
**దుర్వా దుస్వప్న నాశిని"**

శతమూలా శతాంకురా.. నేల మీద గరిక పాకి వేర్లు కిందకి దిగుతాయి. పైకి ఎత్తితే ప్రతి కణుపుకు వేర్లు కనిపిస్తాయి. ఇలా నేలబారుగా పాకిన గరిక ఎంతో శ్రేష్ఠమైంది. దీనితో గణపతిని పూజిస్తే వినాయకుడు వంశాభివృద్ధిని కలిగిస్తాడు. తీవ్రమైన పీడకలల పరిహారానికై స్నానం చేసి గరికను ముట్టుకుంటేచాలు.. ఆ పీడ హరించిపోతుందని పెద్దల ఉవాచ. ●



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



సంతానాభివృద్ధి ఆశించిన విధంగా ఉంటుంది. స్త్రీలు స్థిరాస్థి కొనుగోలు చేస్తారు. విదేశాల్లో వున్న ఆత్మీయుల నండి శుభ సమాచారం అందుకుంటారు. దుష్ట సాంగత్యం మంచిది కాదని స్వీయానుభవంతో తెలుసుకుంటారు. క్రయ-విక్రయాలు సామాన్యంగా ఉంటాయి. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. గృహ ప్రాప్తి.

## వృషభం



విందు-వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్య సలహాలు, సూచనలు పాటించండి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. వ్యవసాయదారులకు బాగుంటుంది. సాహిత్య సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. వృధా ఖర్చులను నియంత్రించడంలో విఫలమవుతారు.

## మిథునం



విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. వృత్తి రంగాల్లో వున్నవారికి బాగుంటుంది. భాగస్వామ్య వ్యాపారులకు ఆశించిన ఫలితాలుంటాయి. ప్రయాణాల్లో విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండండి. అకారణంగా మానసిక ఆందోళనకు లోనవుతారు. గతంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభించి వారాంతంలో పూర్తి చేస్తారు. చర్చలు వాయిదా.

## కర్కాటకం



ముఖ్యమైన పనుల్లో ప్రతికూలతలు ఎదురవుతాయి, సంయమనంతో వ్యవహరించండి. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తి చేస్తాయి. విదేశీ వస్తువులపై మక్కువ ఏర్పడుతుంది. కుటుంబ ఖర్చులు అనూహ్యంగా పెరుగుతాయి. దూర ప్రాంతాల్లో వున్న ఆత్మీయుల నుండి శుభ సమాచారం అందుకుంటారు. భూ వివాదాలు తీరుతాయి.

## సింహం



చిరు వ్యాపారులకు సామాన్యంగా బాగుంటుంది. మొండి బకాయిలు వసూలవుతాయి. తీర్థ యాత్రలు చేస్తారు. వృత్తి విద్యాకోర్సుల్లో చేరతారు. శ్రమకు తగిన ప్రతిఫలం లభించకపోవచ్చు. దుర్వ్యసనాలకు దూరంగా వుండాలని దృఢ నిశ్చయం చేసుకుంటారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకండి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## కన్య



కుటుంబ బాధ్యతలు తీరుతాయి. సన్నిహితుల సహకారంతో ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. తీర్థ యాత్రలు చేస్తారు. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. వృత్తి వ్యాపారస్తులకు పోటీ ఎదురవుతుంది. స్త్రీలతో మాట్లాడేటప్పుడు ఆచి తూచి వ్యవహరించడం చెప్పదగిన సూచన. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

## తుల



విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి ఉంటుంది. వివాదాలకు దూరంగా వుండడం శ్రేయస్కరం. ఆరోగ్యం కుదుట పడుతుంది. ఎదురు చూస్తున్న సమాచారం ఆలస్యంగా అందుకుంటారు. ధార్మిక చింతన అలవడుతుంది. అనాథాశ్రమాలకు ఇతోధికంగా ఆర్థిక సహాయం చేస్తారు. వ్యవసాయ భూమి కొనుగోలు చేస్తారు. సోదరుల మధ్య అపార్థాలు తీరి ఐకమత్యం ఏర్పడుతుంది. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి.

## వృశ్చికం



ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. అకారణంగా ఆందోళనకు లోనవుతారు. ఓర్పు వహించండి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. చిన్ననాటి మిత్రుల సహకారంతో చిరకాల కోరిక నెరవేరుతుంది. వ్యాపారులకు బ్యాంకు రుణాలు మంజూరవుతాయి. కళాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు లభిస్తాయి. శత్రువులు మిత్రులవుతారు.

## ధనుస్సు



ఉద్యోగులకు పనివత్తిడి పెరుగుతుంది. స్వగృహ రుణాలు తీరుస్తారు. వ్యాపారులకు అనూహ్యంగా మొండి బకాయిలు వసూలవుతాయి. శక్తి సామర్థ్యాలకు తగిన గుర్తింపు లభిస్తుంది. విందు-వినోదాల్లో పాల్గొంటారు. విదేశీ ప్రయాణ ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. స్త్రీలకు శుభ యోగం. వృత్తి విద్యా కోర్సుల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. దేవాలయాలు సందర్శిస్తారు. సాహితీ మిత్రులను కలుసుకుంటారు.

## మకరం



వస్తువుల కొనుగోలు-అమ్మకం వ్యవహారాలు లాభసాటిగా సాగుతాయి. కోర్టు పనులు వాయిదా పడతాయి. తీర్థ యాత్రలు చేస్తారు. ఉద్యోగులకు పదోన్నతి/స్థాన చలన సూచనలున్నాయి. శ్రమకు తగిన ప్రతిఫలం పొందుతారు. విలువైన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. విద్యార్థుల శ్రమకు ఆశించిన ఫలితాలు లభిస్తాయి. ఆర్థిక ఇబ్బందులున్నా సమయోచితంగా వ్యవహరించి సర్దుబాటు చేసుకుంటారు.

## కుంభం



అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు. ఉద్యోగులకు పై అధికారుల ప్రశంసలు లభిస్తాయి. వృధా ఖర్చులను నియంత్రించడంలో సఫలీకృతులవుతారు. ప్రత్యర్థుల వ్యూహాలను చాకచక్యంతో ఎదుర్కొంటారు. అనాథలకు ఆశ్రయం కల్పిస్తారు. వృత్తి విద్యల పట్ల ఆసక్తి ఏర్పడుతుంది. తీర్థ యాత్రలు చేస్తారు. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు.

## మీనం



శుభ కార్య చర్చలు ఫలిస్తాయి. తాహతుకు మించిన రుణాలు చేయకపోవడం మంచిది. వృత్తి రంగాల్లో వున్నవారికి పోటీ ఏర్పడుతుంది. ప్రయాణం లాభిస్తుంది. కుటుంబంలో ఐకమత్యం లోపిస్తుంది. ప్రతికూలతలు ఎదురైనా ప్రారంభించిన పనులు వారాంతంలో పూర్తి చేస్తారు. ఉద్యోగంలో ఒడుదుడుకులుంటాయి. సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. కోర్టు తీర్పులు సానుకూలంగా ఉంటాయి.

# భక్తుల కోరికలు తీర్చే కాణిపాకం వరసిద్ధి వినాయకుడు



**దేశంలోని** అన్ని వినాయక ఆలయాల్లో ప్రత్యేకమైంది కాణిపాక వరసిద్ధి వినాయక ఆలయం. సత్య ప్రమాణాల స్వామిగా ఇక్కడి గణనాథుడు పూజలందుకుంటున్నాడు. రోజు రోజుకూ పరిమాణంలో పెరుగుతూ భక్తుల కోరికలు తీర్చే స్వామిగా పేరు పొందాడు. చిత్తూరు జిల్లా ఐరాల మండలంలోని కాణిపాకం గ్రామంలో స్వయంభూగా వెలిసాడు.

## ఆలయ చరిత్ర

ఆలయ చరిత్ర గురించి ఎన్నో దశాబ్దా లుగా ఓ కథ ప్రచారంలో ఉంది. పూర్వం విహారపురి అనే గ్రామంలో ధర్మాచరణ పరాయణులైన ముగ్గురు వికలాంగ అన్నదమ్ములు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. పూర్వ జన్మ కర్మ ఫలంగా వారు గుడ్డి, మూగ, చెవిటివారిగా జన్మించారు. ఓ ఏడాది గ్రామం కరవుకాటకాలతో అల్లాడిపోయింది. తాగడానికి నీళ్లు కూడా దొరకని దుర్భర స్థితి ఏర్పడింది. కరవును జయించడానికి ఈ ముగ్గురు సోదరులు తమ పొలంలో ఉన్న ఏత బావిని లోతు చేయడానికి పూనుకున్నారు.

బావిని తవ్వుతుంటే ఓ పెద్ద బండరాయి అడ్డుపడింది. దాన్ని పలుగు, పారల సాయంతో తొలగిస్తుండగా చేతిలో ఉన్న పార రాయికి తగిలి రక్తం చిమ్మి ఆ ముగ్గురి పైన పడింది. దాంతో వారి వైకల్యం పోయి మామూలు మనుషుల య్యారు. వాళ్లు వెంటనే ఆ గ్రామాన్ని పాలిస్తున్న రాజుకు, గ్రామస్థులకు జరిగిన విషయం వివరించారు. అక్కడికి చేరుకున్న గ్రామస్థులు బావిని పూర్తిగా తవ్వగా 'గణనాథుని' రూపం కనిపించింది. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో స్వామిని పూజించి, కొబ్బరికాయలు సమర్పించారు. అలా సమర్పించిన కొబ్బరికాయల నుంచి వచ్చిన తీర్థం 'కాణి' స్థలంలో (కాణి అంటే ఎకరం పొలం) పారింది. అప్పటినుంచి విహారపురి కాస్త 'కాణిపాకరమ్'గా మారింది. కాలక్రమంలో 'కాణిపాకం'గా స్థిరపడింది.

ఈ క్షేత్రం శివ, వైష్ణవ ఆలయాలకు నిలయం. ఆలయ ప్రాంగణంలో వరసిద్ధి వినాయక స్వామి ఆలయంతో పాటు మణికంఠేశ్వర స్వామి, వరదరాజ స్వామి, వీరాంజనేయ స్వామి ఆలయాలున్నాయి. బావిలో ఉద్భవించిన వినాయకుడు క్రమంగా పరిమాణంలో పెరుగుతుండటం విశేషం. సుమారు అరవై అయిదు సంవత్సరాల క్రితం ఓ భక్తురాలు స్వామివారికి బహూకరించిన



కవచాలు, 2000వ సంవత్సరంలో మరో భక్తుడు ఇచ్చిన వెండి కవచాలు ప్రస్తుతం స్వామివారికి సరిపోవడం లేదు. ఒకప్పుడు ఇవి స్వామి ఆలంకరణలో భాగంగా వుండేది. భక్తులు వీటిని చూసేందుకు వీలుగా ఆలయంలో ప్రదర్శనగా ఉంచారు. ఇక్కడి స్వామివారి ఎదుట తప్పుడు ప్రమాణాలు చేస్తే శిక్ష అనుభవిస్తారని ప్రతీతి.

స్వామివారి క్షేత్రం పక్కనే ఉన్న బాహుదా నదిని భక్తులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. ఆ నది వైశిష్ట్యానికి సంబంధించిన ఓ కథ ప్రచారంలో ఉంది. శంఖుడు, లిఖితుడు అనే సోదరులు స్వామివారిని దర్శించుకునేందుకు తమ గ్రామం నుంచి బయలుదేరారు. దారి మధ్యలో తినడానికి తెచ్చుకున్న ఆహార పదార్థాలు అయిపోయాయి. అప్పటికి వాళ్లు కాణిపాకానికి చాలా దూరంలో ఉన్నారు లిఖితుడు ఆకలికి తట్టుకోలేక పక్కనే వున్న మామిడితోటలో ఓ పండు కోసుకుని తింటానని అన్న శంఖుడిని అడిగాడు.

దొంగతనం చేయడం తప్పని శంఖుడు వారించాడు. అయినా లిఖితుడు అన్న చెప్పిన మాటలు పెడచెవిన పెట్టి తోటలోని మామిడిపండు కోసుకుని తిన్నాడు. తమ్ముడు చేసిన దొంగతనం గురించి అన్న రాజుకు వివరించి, అతని రెండు చేతులు నరికివేయించాడు. కానీ తరువాత తమ్ముడి వైకల్యాన్ని చూసి శంఖుడు చాలా బాధపడ్డాడు. ఇద్దరూ తిరిగి కాణిపాకం చేరుకుని, వినాయకుణ్ణి దర్శించుకునే ముందు పక్కనే వున్న నదిలో మునగగా లిఖితునికి పోయిన చేతులు తిరిగి వచ్చాయి.

అప్పటి నుంచి ఆ నదికి బాహుదా (బాహువులు ఇచ్చింది కనుక) అని పేరు వచ్చింది.

## 21 రోజులు ఉత్సవాలు

వరసిద్ధుని ఆలయంలో వినాయక చవితి మొదలు 21 రోజుల పాటు స్వామివారికి బ్రహ్మోత్సవాలు, ప్రత్యేక ఉత్సవాలు నిర్వహిస్తారు.

మొదటి తొమ్మిది రోజులు బ్రహ్మోత్సవాలు, తరువాత 12 రోజులు ప్రత్యేక ఉత్సవాలు జరుగుతాయి. రాష్ట్రంలో మరే ఆలయంలోనూ ఇన్ని రోజుల పాటు ఉత్సవాలు నిర్వహించరు.

కాణిపాకం తిరుపతికి ఎనభై కిలోమీటర్లు; జిల్లా కేంద్రం నుంచి పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. ❒

# భక్తుల మనోభీష్టాలు నెరవేర్చే వినాయకులు




బెంగళూరు సవనగుడి ప్రాంతంలో కొలువైన స్వామిని దొడ్డ గణపతి అని పిలుస్తారు. ఈ ఆలయంలోని విగ్రహం చాలా పెద్దది. అర్చకులు నిచ్చెన ఎక్కి స్వామివారికి పూజాదికాలు నిర్వహిస్తారు. ప్రతి బుధవారం స్వామివారిని వెన్నతో అలంకరిస్తారు. ఈ దేవాలయంలో నారికేళం స్వీకరించి ఇరవై ఒక్క నెలలు సంకష్ట హరగణపతి వ్రతం చేస్తే మనోభీష్టాలు నెరవేరుతాయని భక్తుల నమ్మకం.

కోలార్ జిల్లాలోని కురుడుమలెలో కొలువైన ఏకశిలా సాలిగ్రామ వినాయకుడు అత్యంత మహిమాన్వితుడని ప్రతీతి. ఈ స్వామిని దర్శించుకుంటే ఉద్యోగం లభిస్తుందని భక్తుల విశ్వాసం. ఉద్యోగం వచ్చిన తరువాత మరోసారి స్వామి దర్శనం చేసుకుంటారు. ఏదైనా ముఖ్యమైన పని మొదలు పెట్టాలంటే ముందుగా ఈ గణనాథుణ్ణి దర్శించుకుని భక్తులు ఆశీర్వాదం తీసుకుంటారు.

ఆత్మలింగాన్ని లంకకు తీసుకుపోకుండా రావణుణ్ణి గణపతి ఆపిన స్థలమే గోకర్ణం. గణపతి ఆత్మలింగాన్ని నేలపై పెట్టిన ప్పుడు రావణుడికి కోపం వచ్చి ఓ మొట్టికాయ వేశాడట. ఇక్కడి గణపతి శిరస్సుపై చేతితో మొట్టిన గుర్తులు కనిపిస్తాయి. ఈ స్వామిని దర్శిస్తే జాతక దోషాలు పోతాయని భక్తుల నమ్మకం.

వినాయకుణ్ణి తమిళులు పిళ్లయార్, వినాయగార్ అన్న పేర్లతో పూజిస్తారు. ఈ రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన అనేక వినాయక క్షేత్రాలు ఉన్నాయి. శివగంగ జిల్లాలోని ఉన్న పిళ్లయార్ పట్టి కార్పాగ వినాయగార్ ఆలయం ఎంతో మహిమాన్వితమైంది. ఒక గుహాలయంలో వెలసిన నల్లరాతి గణపతిని దర్శించుకునేందుకు భక్తులు వేలాదిగా వెళ్తుంటారు. మూలవిరాట్టు ఆరడుగుల ఎత్తుంటుంది.



శ్రీరంగానికి సమీపంలో ఉన్న తిరుచిరాపల్లి రాక్‌ఫోర్ట్ ఉచ్చిపిళ్లయార్ గణపతి ఆలయం ప్రపంచ ప్రసిద్ధి చెందిన క్షేత్రం. ఓ కొండపై


# తమిళ పిళ్లయార్

కొలువైన గణపతిని విభీషణుడు ప్రతిష్ఠించాడని ఇక్కడి పురాణం కథనం.


వేలూరు జిల్లాలోని పొన్నై క్షేత్రంలో వెలసిన రాహు కేతు గణపితిని గ్రహ దోష నివారకుడిగా భక్తులు పూజిస్తారు.

మధురై మీనాక్షి సన్నిధిలోని ముక్కురుణి పిళ్లయార్‌ను దర్శిస్తే అన్నపానాలకు లోటుండదని భక్తుల నమ్మకం.

కుంభకోణం సమీపంలో వెలసిన తిరుపురంబియం వినాయగార్ ఆలయంలో స్వామివారికి వినాయకచవితి రోజున తేనెతో మాత్రమే అభిషేకిస్తారు. స్వయంభు వుగా వెలసిన ఈ గణపతిని ప్రతిరోజూ భక్తులు దర్శించుకుంటారు. ఈ క్షేత్రానికి దగ్గరలో తిరువళన్‌జుళిలో శ్వేత గణపతి కొలువయ్యాడు. సముద్రపు ఇసుకతో ఇంద్రుడు ఈ గణపతిని రూపొందించాడని అంటారు. స్వామివారికి ఎలాంటి అభిషేకాలు, పూజలు ఉండవు. పచ్చకర్పూరాన్ని మాత్రం సమర్పిస్తుంటారు.



చిత్రకా'ర్టూ'న్స్


అనిండ్యా..! బలవంతంగా.. బెదిరించి చందాలు వసూలు చేసి పెట్టిన మండపాలు బ్లాక్ లిస్ట్‌లో పెట్టారా...?!
Zakir...
మూషికా.. సిద్ధంగా ఉండుము..! వీళ్ళు మరికొ నీటిలోకి తోసేసే లోపల మనం జంప్ అవ్వాలి..!!
Zakir...
...కింది కోర్టు.. పై కోర్టు.. సుప్రీం కోర్టు.. రాష్ట్రపతి క్షమా భిక్ష... తప్పితే.. పంద్రాగస్టు.. రిపబ్లిక్ డే ఉండనే ఉండే... వే ఫికర్..!!
లాయరు.. క్రిమినల్ దిట్ట..
Zakir...





